



పోస్టర్ ఆవిష్కరిస్తున్న జిల్లా జడ్జి గంధం సునీత, తదితరులు

నౌకాశ్రయం!



కాకినాడలో హిందుస్థాన్ షిప్‌యార్డ్ నిర్మాణ యోచన

- అనువైన ప్రాంతానికి అన్వేషణ
- 110 ఎకరాలకు ప్రతిపాదన
- బుధవారం ప్రతినిధుల పర్యటన
- డీప్‌వాటర్‌పోర్టులో పరిశీలన
- రూ.900 కోట్లతో కేంద్రం
- అన్నీ కుదిరితే పెద్ద ప్రాజెక్టు
- మారిటైంబోర్డు సానుకూలత
- మూలపేటపైనా కసరత్తు

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

కాకినాడలో నౌకా నిర్మాణ కేంద్రం ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయి. కేంద్ర ప్రభుత్వానికి చెందిన హిందుస్థాన్ షిప్ యార్డు లిమిటెడ్ (హెచ్‌ఎస్‌ఎల్) ఇక్కడ శాటిలైట్ షిప్‌యార్డు నిర్మాణానికి మొగ్గు చూపుతోంది. ఈ మేరకు హెచ్‌ఎస్‌ఎల్ అధికారికంగా ధ్రువీకరించింది.ఈ నేపథ్యంలో కాకినాడలో అనువైన భూముల లభ్యత ఎక్కడ ఉందనేది పరిశీలిస్తోంది. ఇప్పటికే ఇక్కడ ఓ సంస్థ ఎప్పటి నుంచో నౌకలు తయారు చేస్తుండడం,ఇక్కడున్న సానుకూల వాతావరణంతో కాకినాడే ఖాయమయ్యే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

కాకినాడ అనువైన ప్రాంతం

నౌకల నిర్మాణం చేపట్టడానికి సముద్రపు అలల తాకిడి తక్కువగా ఉన్న ప్రాంతం చాలా కీలకం.ఇది కాకినాడలో ఉంది. పైగా ఒకప్పుడు బ్రిటిష్ యుగంలో కోరంగి వద్ద నౌకల తయారీ, మరమ్మతులు జరిగేవి. అప్పుడే ఈ రంగంలో కాకినాడ పేరొందింది. కానీ ఆ తర్వాత పెద్దగా ఈ రంగం కాకినాడలో విస్తరించలేదు. నౌకల తయారీకి సముద్రానికి ఆనుకుని విశాలమైన భూములు అవసరం. వీటిలో నౌకలు, బార్జీలు, టగ్‌లు తయారు చేసి ఆ పక్కనే ఉన్న సముద్ర జలాల్లోకి వీటిని దించి పరీక్షలు చేసి సరుకు రవాణాకు వినియోగిస్తారు.ఈ అనుకూల వాతావరణం కాకినాడలోనే ఉంది. సీఫ్రంట్‌గా పిలిచే ఈ సౌకర్యం కాకినాడ జగన్నాథపురం బ్రిడ్జి నుంచి యాంకరేజ్ పోర్టు వరకు రెండు కిలోమీటర్ల వరకు విస్తరించి ఉంది. ఇన్ని సానుకూలతలు కాకినాడకు ఉన్నాయి.

గతంలో చాలా కంపెనీలు..

గతంలో కాకినాడలో షిప్‌యార్డు నిర్మించడానికి సింగపూర్ కంపెనీ ముందుకు వచ్చింది. కాకినాడ సీపోర్టులో కొంతకాలం కార్యకలాపాలు నిర్వ హించింది. వివిధ దశల్లో రూ.1,725 కోట్ల పెట్టుబడులకు సిద్ధమైంది. ప్రోత్సాహం కరువై ఇక్కడ యార్డును మూసేసింది. ఎల్‌అండ్‌టీ కంపెనీ 2006లో కాకినాడలో షిప్‌యార్డు నిర్మాణానికి ముందుకొచ్చింది. రూ.2 వేల కోట్ల పెట్టుబడితో నౌకా నిర్మాణ కేంద్రం ఏర్పాటుకు రంగం సిద్ధం చేసుకుంది. కానీ అప్పటి ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం లేక చెన్నైకు వెళ్లిపోయింది. 2020లో రూ.7 కోట్ల కాకినాడ స్మార్ట్‌సిటీ నిధులతో జగన్నాథపురం సమీపంలో అధికారులు బోట్ బిల్డింగ్ యార్డు నిర్మించారు.ఇందులో ఒకేసారి 18 వరకు భారీ బోట్లు తయారుచేసే వసతులు సిద్ధం చేశారు. కానీ తగిన ప్రోత్సాహం లేక అదీ ఈసురోమంటోంది. కొచ్చిన్, గోవా, మజ్‌గావ్‌లో హిందుస్థాన్ షిప్‌యార్డులు 100 నుంచి 150 ఎకరాల విస్తీర్ణంలో నౌకలను నిర్మిస్తున్నాయి.ప్రస్తుతం కాకినాడలో శాన్‌మెరైన్ అనే సంస్థ ఎన్నో ఏళ్లుగా చిన్న, మధ్య తరహా నౌకలు, బార్జీలు, టగ్‌లు నిర్మిస్తోంది. గతేడాది 8వేల టన్నుల భారీ నౌకను నిర్మించింది. వచ్చే ఐ దేళ్లలో మరో 25 వరకు నిర్మించి దేశ వ్యాప్తంగా పలు కంపెనీలకు అందివ్వడానికి సిద్ధమవుతోంది. ఈ సంస్థ హిందుస్థాన్ షిప్‌యార్డుతోను పలు ఒప్పందాలు చేసుకుంది.

ఓకే అంటే రూ.900 కోట్లు

బుధవారం డీప్‌వాటర్‌పోర్టు ఏరియాలోని రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన భూములను హిందుస్థాన్ షిప్‌యార్డు ప్రతినిధులు పరిశీ లించారు.భూముల లభ్యత.. సముద్రానికి ఎంత దూరం వంటివన్నీ పరిశీలించారు. ఇక్క డే ఉన్న మారీటైం బోర్డు అధికారులతోను సమావేశమయ్యారు.ఈ నేపథ్యంలో త్వరలో నిర్ణయం తీసుకోనున్నారు. ఒకవేళ కాకినాడలో భూములు ఓకే అయితే రూ.900 కోట్ల వరకు హిందుస్థాన్ షిప్‌యార్డు ఇక్కడ పెట్టుబడులు పెట్టనుంది. ప్రస్తుతం రక్షణశాఖకు అవసరమైన అన్నిరకాల యుద్ధ,ఇతర నౌకలను హెచ్ ఎస్‌ఎల్ నిర్మిస్తోంది. భారత నావికాదళంతో రూ.19 వేల కోట్ల విలువైన భవిష్యత్తు ఆర్డర్లు ఈ సంస్థకు ఉన్నాయి.ప్రస్తుతం విశాఖలో ఉన్న షిప్‌యార్డుకు బ్రాంచ్ యార్డుగా కొత్తది నిర్మించనున్నారు. తద్వారా నౌకల నిర్మాణం మరింత వేగవంతం చేయాలని ఈ సంస్థ ఆలోచన. కాకినాడతో పాటు శ్రీకాకుళం జిల్లా మూలపేట తీరప్రాం తాన్ని హెచ్‌ఎస్‌ఎల్ పరిశీలించి తుది నిర్ణయం తీసుకోనుంది.దాదాపుగా కాకినాడవైపే హెచ్ ఎస్‌ఎల్ ఎక్కువ ఆసక్తి చూపుతోందని అధికారులు చెబుతున్నారు. ఇక్కడ సానుకూలతతో పాటు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన ఏపీ మారిటైం పాలసీకి కాకినాడ కేంద్రంగా ఉన్న రాష్ట్ర మారిటైం బోర్డు కార్యాలయం నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తుండడంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఇక్కడే భూముల కేటాయింపు జరిగేలా పర్యవేక్షిస్తోంది.



సీఎంను కలిశారు..

రాష్ట్రంలో భారీ నౌకల నిర్మాణం విశాఖలో కేంద్ర ప్రభుత్వానికి చెందిన హిందుస్థాన్ షిప్‌యార్డు చేపడుతోంది.ఇది మినహా షిప్‌యార్డు మరెక్కడా భారీగా లేదు. త్వరలో మరో షిప్‌యార్డు నిర్మించడానికి కాకినాడ అనువైనదిగా భావిస్తోంది.110 నుంచి 150 ఎకరాల భూములు ఉన్న చోట షిప్‌యార్డు నిర్మాణం చేపడతామని హెచ్‌ఎస్‌ఎల్ సీఎండీ ఇత్రీ ప్రకటించారు.ఇప్పటికే సీఎం చంద్రబాబును కలిసి తమ ప్రతిపాదన వివ రించారు.షిప్‌యార్డుకు కాకినాడే అనువైనదిగా ఆ సంస్థ భావిస్తోంది.

అక్రమ కార్యకలాపాలపై కఠిన చర్యలు

జిల్లా జడ్జి గంధం సునీత

రాజమహేంద్రవరం సిటీ, జూలై 30(ఆంధ్రజ్యోతి): అక్రమ కార్యకలాపాలపై చట్టపరంగా కఠిన చర్యలను లీగల్ సర్వీసెస్ అథారిటీ తీసుకుంటుందని జిల్లా జడ్జి గంధం సునీత అన్నారు. ప్రపంచ మానవ అక్రమ రవాణా దినంను పురస్కరించుకుని జిల్లా కోర్టు ఆవరణలో బుధవారం చైల్డ్‌వెల్ఫేర్, విద్య, పోలీస్ తదితర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు.మానవ అక్రమ రవాణా దినం పోస్టర్ ఆవిష్కరించారు.2015 నుంచి మానవ అక్రమ రవాణా, బాల కార్మికులు, బాల్య వివాహాలు, లైంగిక వేధింపులు, కిడ్నాప్ తదితర చట్టవ్యతిరేక చర్యలపై చర్యలు తీసుకుంటున్నామన్నారు.

రెండు రోజుల్లో సుఖీభవ



మరో హామీకి సర్కారు గ్రీన్‌సిగ్నల్

- 2న రైతుల ఖాతాలకు సొమ్ములు
- అన్నదాత సుఖీభవ రూ.5 వేలు
- పీఎం కిసాన్ రూ.2 వేలు
- ఒక్కో ఖాతాలో రూ.7 వేలు జమ
- పీఎం కిసాన్ లబ్ధిదారులే ఎక్కువ
- కౌలు రైతులకు రూ.20 వేలు
- వచ్చే విడత నుంచి అమలు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

అన్నదాతలకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు శుభవార్త చెప్పాయి. రైతులను ప్రోత్సహించడానికి రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ, కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ పథకం కింద సహాయం చేయనున్నాయి.గత వైసీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు రైతులకు ఏడాదికి కేవలం రూ. 13,500 మాత్రమే రైతు భరోసా కింద ఇచ్చేవారు. అందులో రాష్ట్రం వాటా రూ.7500, కేంద్రం వాటా రూ.6 వేలు ఉండాది. ఎన్నికల హామీలో భాగంగా తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఏకంగా 6,500 పెంచి మొత్తం రూ.20 వేలు వేస్తోంది. రాష్ట్రం వాటా రూ.14 వేలు, కేంద్రం వాటా రూ.6 వేలు. కానీ అప్పటి మాదిరిగానే మూడు విడతలుగా సొమ్ము రైతుల బ్యాంక్ ఖాతాలకు జమకానుంది. ఏప్రిల్ నుంచి జూలై వరకూ మొదటి విడత , ఆగస్టు నుంచి నవంబరు వరకూ రెండో విడత, డిసెంబర్ నుంచి మార్చి వరకూ మూడో విడతగా విభజించారు. అన్నదాత సుఖీభవ కింద రాష్ట్ర ప్రభుత్వం మొదటి విడత రూ.5 వేలు, రెండో విడత రూ.5 వేలు, మూడో విడత రూ.4 వేలు జమ చేస్తుంది. పీఎం కిసాన్ పథకం కింద ఒక్కో విడతకు రూ.2వేలు వంతున మూడు విడతల్లో ఆరువేలు సరిపెడుతుంది. ఆగస్టు 2న జిల్లాలో ఒక్కో రైతుకు రూ.7 వేల వంతున జమకానుంది.ఈ సారి ప్రభుత్వం కౌలు రైతులకు ఈ పథకాన్ని వర్తింపజేస్తుంది. ఒక్కో రైతుకు రూ.20 వేల వంతున ఇస్తుంది. ఈ విడతలో ఇంకా అర్హులైన కౌలు రైతుల లెక్కతేలక వచ్చే విడత నుంచి జమచేస్తారు..

ఎవరు అనర్హులంటే..

రాజ్యాంగం ప్రకారం జరిగిన ఎన్నికల్లో ఎన్నికైన ప్రజాప్రతినిధులందరూ ఈ పథకం కింద లబ్ధి పొందడానికి అనర్హులు.ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఎంపీపీ, జడ్పీ చైర్మన్, సర్పంచ్, వార్డు సభ్యులు కూడా అనర్హులే.కౌన్సిలర్లు, మునిసిపల్ చైర్మన్లు అనర్హులే. ఆదాయ పన్ను చెల్లింపుదారులు, ప్రభుత్వ ఉద్యోగులు అనర్హులు. వెబ్‌ల్యాండ్‌లో లేని రైతులకు ఈ పథకం వర్తించవదు. పీఎం కిసాన్ పథకం కింద గతంలో లబ్ధిపొందినా రైతు చనిపోతే వారి కుటుంబీలకు కూడా ఇవి వర్తించవు. జిల్లాలో ఈకేవైసీ కింద 13 మంది పెండింగ్ ఉన్నారు. విదేశాలు, ఇతర రాష్ట్రాల్లో కొందరు ఉండగా బయోమెట్రిక్‌లో వేలిముద్రలు పడకపోవడం వల్ల కొందరికి సమస్యగా ఉంది.కనీసం పది సెంట్ల భూమి ఉన్నా ఈ పథకం కింద అర్హులవుతారు.

జిల్లాకు రూ. 54 కోట్లు

ఆగస్టు 2న జిల్లా రైతాంగానికి అన్నదాత సుఖీభవ కింద సుమారు రూ.54 కోట్లు జమ కానుంది. జిల్లాలో మొత్తం 1,16, 544 మంది రైతులు ఉండగా వారిలో ఈకేవైసీ పూర్తయిన వారు 1,13,539 మంది ఉన్నారు.2,992 మందిని వివిధ కారణాలతో రిజక్ట్ చేశారు. 13 పెండింగ్ ఉన్నాయి. ఈ రెండు రోజుల్లో వారు ఆధారాలు చూపి సరిచేసుకుంటే డబ్బులు పడతాయి.ఆధార్ నంబర్ సరిగ్గా లేకపోవడం, బ్యాంక్ ఖాతాలు పనిచేయకపోవడం వంటి కారణాలు ఉన్నాయి.



పీఎం కిసాన్ రూ. 24 కోట్లు

పీఎం కిసాన్ కింద జిల్లాలో ఒక లక్షా 20 వేల మంది రైతులకు రూ.2 వేల వంతున రూ.24కోట్లు జమకా నుంది. జిల్లాలో అన్నదాత సుఖీభవ కంటే పీ ఎం కిసాన్ రైతులు ఎక్కువ మంది ఉన్నారు. దీనికి కారణం 2019 ఫిబ్రవరి 1వతేదీ లోపు భూమి రికార్డుల డేటా ఆధారంగా పీఎం కిసాన్ అమలవుతోంది. అప్పటి నుంచి డేటా మారలేదు. చనిపోయిన వారుంటే తీసేస్తున్నారు. కానీ అమ్మకాలు, కొనుగోళ్లు చేసిన రైతులకు మాత్రం ఈ పథకం వర్తిస్తుంది.



డ్రగ్స్‌పై అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎస్పీ నరసింహ కిశోర్

డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

ఎస్పీ నరసింహ కిశోర్

రాజమహేంద్రవరం కల్చరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): యాంటిబయోటిక్స్, నార్కోటిక్స్ డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలని జిల్లా ఎస్పీ నరసింహ కిశోర్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పిలుపు మేరకు ఈగల్ టీం, ది రాజమండ్రి కెమిస్ట్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం రాజమహేంద్రవరంలో నిర్వహించిన భారీ అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. డ్రగ్స్‌కు అలవాటు పడిన వారికి నగరంలో ఇప్పటికే రెండు యాంటీ డ్రగ్స్ ఎడిక్ట్ కేంద్రాల ద్వారా కౌన్సెలింగ్ ఇప్పి స్తున్నామని తెలిపారు. మెడికల్ షాపుల్లో ఎక్కువ మోతాదులో డ్రగ్స్‌ను కొనుగోలు చేస్తు న్న వారి వివరాలు పోలీసులకు తెలియజేయాలన్నారు. గంజాయి వినియోగదారులపై తగిన చర్యలు తీసుకుంటామన్నారు. గంజా యి విక్రయించే వారిపై పీడీ యాక్టు నమోదు చేస్తామని హెచ్చరించారు.డ్రగ్స్ కంట్రోల్ అసిస్టెంట్ డైరెక్టర్ పి.నాగమణి మాట్లాడుతూ, వైద్యుల చీటీ లేకుండా కొన్ని మందులు విక్రయించకూడదన్నారు. అనంతరం జాంపేట పోలీస్ కన్వెన్షన్ హాలులో అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్య క్షుడు పిల్లా బాబు, తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు రాయపూడి శ్రీనివాసరావు, హోల్‌సేల్ అధ్యక్షుడు మహేంద్రనాథ్, సెక్రటరీలు ఫణీంద్ర, కృష్ణబాలాజీ, పెండెం రామూజీ, సంపత్‌కుమార్, లాలాధర్, డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ హరిహర తేజ,ఏఎస్పీ మురళీ కృష్ణ(అడ్మినిస్ట్రేషన్),మెడికల్ షాపు యజమానులు తదితరులు పాల్గొన్నారు.



సమస్యల్లేకుండా చూడండి

సమగ్ర శిక్ష అడిషనల్ కోఆర్డినేటర్

రాజానగరం, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : ఉదయం నుంచి విద్యుత్ సరఫరా లేకపోవడం,జనరేటర్ అందుబాటులో లేకపోవడం వల్ల ఉపాధ్యాయులు ఇబ్బంది ఎదుర్కొన్నారని తూర్పుగోదావరి జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ కోఆర్డినేటర్ ఎస్.సుభాషిణి అన్నారు. రాజానగరం మండలంలో మల్లంపూడిలోని శ్రీసాయి మాధవి ఇంజనీరింగ్ కళాశాలలో కస్తూర్బా గాంధీ విద్యాలయం కాంట్రాక్టు ఉపాధ్యాయులకు జరుగుతున్న శిక్షణ తరగతులను బుధవారం సందర్శించారు. శిక్షణా కేంద్రంలో అరకొర వసతులు, అసౌకర్యాలపై పత్రికల్లో వచ్చిన కథనాలపై ఆమె స్పందించి కళాశాలలో నెలకొన్న ఇబ్బందులను పరిశీలించారు. వాటర్ ట్యాంకులతో కూడిన నీటి సదుపాయంతో పాటుగా జనరేటర్ ఏర్పాటు చేశామన్నారు. శిక్షణ కేంద్రంలో ఉపాధ్యాయులకు ఏర్పాటు చేసిన భోజనాన్ని వారితో కలిసి భుజించి సంతృప్తి వ్యక్తం చేశారన్నారు. బాత్‌రూమ్‌లకు తలుపులు లేవని చెప్పడం అవాస్తమన్నారు. ఇటువంటి పరిస్థితులు పునావృతం కాకుండా చూడాలని నిర్వాహకులను ఆదేశించారు.

వైసీపీ కమిటీల ఏర్పాటు

రాజమహేంద్రవరం, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ఎట్టకేలకు సంస్థాగత నియామకాలపై దృష్టి పెట్టింది. గ్రేటర్ రాజమహేంద్రవరం కమిటీని నియమించింది. మాజీ ఎంపీ మార్గాని భరత్ సిటీ ప్రెసిండెంట్‌గా ఉన్న సంగతి తెలిసిందే. కొత్తగా 38 మందిని నియమిస్తూ కేంద్ర కమిటీ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. చోడిశెట్టి సత్యవేణి రాఘవబాబు, గుత్తుల మురళీధర్, దుంపా చంద్రరెడ్డి వైస్‌ప్రెసిండెంట్లుగా, దుర్వాసుల సత్యనారాయణ మూర్తి, నాగేశ్వరరావు, కానుబోయిన సాగర్, మహ్మద్ షబీర్, నందం స్వామి, జువ్వల నాగేశ్వరరావు, కారపురెడ్డి బాబ్జి రెడ్డిని ప్రధాన కార్యదర్శులుగా నియమించారు. మరో 13 మందిని సెక్రటరీలుగా, మరో 15 మందిని ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా నియమించారు. ఇక జిల్లా వైస్ ప్రెసిడెంట్‌గా కడియాల శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా దాసి వెంకట్రావు, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా ముప్పన శ్రీనివాస్, లక్కోజు ఓంకార్, సెక్రటరీలుగా తమ్మిశెట్టి శివ ప్రసాద్, దామదాసు శ్యామ్ సుధీర్, జిల్లా అధికార ప్రతినిధిగా రొక్కం త్రినాథ్ నియమితులయ్యారు.

5 మండలాల్లో.. 150 మందే కట్టారా!

అధికారులపై కలెక్టర్ సీరియస్

రాజమహేంద్రవరం,జూలై 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో అందరికీ గృహం కార్యక్రమం పనుల్లో పురోగతి ఉండాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో బుధవారం ఐదుగురు మండల స్థాయి అధికారులతో సమీక్షించారు. సీతానగరం, నల్లజర్ల, దేవరపల్లి, రాజానగరం, కడియం మండలాల పరిధిలో అదనపు ఆర్థిక సహాయం 704 మందికి చేస్తే కేవలం 150 మంది మాత్రమే ఇళ్లు నిర్మించుకున్నారన్నారు. ఈ మండలాల పరిస్థితి మొత్తం జిల్లా పనితీరుపై ప్రభావం చూపుతుందన్నారు. సకాలంలో భవన నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. సమీక్షలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, హౌసింగ్ పీడీ ఎస్.భాస్కరరెడ్డి, ఎంపీడీవో,హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.

24 గంటలూ వైద్యం అందాలి

- ఆంధ్రజ్యోతి కథనంతో కదలిక
- సమిశ్రగూడెంలో మంత్రి తనిఖీ



సమిశ్రగూడెం ఆసుపత్రిని పరిశీలించి వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్

నిడదవోలు, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఆంధ్రజ్యోతి దినపత్రికలో బుధవారం "పగలు వైద్యం.. రాత్రికి తాళం" శీర్షికన నిడదవోలు మండలం సమిశ్రగూడెం గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంపై ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. ఆసుపత్రిని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకు అత్యవసర వైద్య సేవలు ఏ మేరకు అందుతున్నాయన్న అంశంపై ఆరా తీశారు.రాత్రి వేళలో ఆసుపత్రి తలుపులు ఎందుకు మూసివేస్తున్నారని ప్రశ్నించారు. రాత్రి వేళల్లో కూడా అత్యవసర సేవలందించాలని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించబోమని హెచ్చరిం చారు.ఇక నుంచి ఈ తరహా తనిఖీలు నిరంతరం కొనసాగుతాయన్నారు.అనంతరం సమిశ్రగూడెంలోని మండల పరిషత్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. నిడదవోలు నియోజకవర్గంలో 192 మంది మార్గదర్శకులు ముందుకు వచ్చారని.. ఒక్క నిడదవోలు మండలంలోనే 2,137 బంగారు కుటుంబాలను గుర్తించామని తెలిపారు. త్వరలోనే మరింత మంది మార్గదర్శకులు, బంగారు కుటుంబాలను గుర్తించి ఆగస్టు 8వ తేదిన పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు. పేదరిక నిర్మూలనకు ఎవరైనా ముందుకు వచ్చి బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవచ్చన్నారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సంధ్య, వైద్యాధికారులు, వైద్య సిబ్బంది ఉన్నారు.

పోస్ట్‌మార్టంపై ఎందుకింత నిర్లక్ష్యం



సూపరింటెండెంట్ ఆఫీస్ ఎదుట ధర్నా

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రి (జీజీహెచ్)లో మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించే ప్రక్రియలో తీవ్ర ఆలస్యం చోటు చేసుకోవడాన్ని నిరసిస్తూ సీతానగరం మండలానికి చెందిన పలువురు మంగళవారం సాయంత్రం జీజీహెచ్ సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు.ఈ సంఘటన ఆసుపత్రి వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. వీలైనంత త్వరగా పోస్టుమార్టం పూర్తిచేసి మృతదేహాలను అప్పగించాల్సి ఉండగా.. ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యం వల్ల రోజుల సమయం పడుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు.దీనిపై సూపరింటెండెంట్ తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అయితే సూపరింటెండెంట్ తన ఛాంబర్‌లో లేరు.సమాచారం తెలుసుకున్న ఆసుపత్రి అధికారులు మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తి చేసి బాధిత కుటుంబీకులకు అప్పగించారు.

కొలిక్కిరాని పేపరుమిల్లు కార్మికుల చర్చలు

రాజమహేంద్రవరం,జూలై 30 (ఆంధ్ర జ్యోతి) : చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న పేపరుమిల్లు కార్మికుల జీతాల సమస్య పరిష్కారమైంది. ఇటీవల పర్మినెంట్ ఉద్యో గులకు రూ.5800 పెంచడానికి అంగీకరించగా.. బుధవారం తాత్కాలిక ఉద్యోగుల జీతాలు, బకాయిల విషయంలో కూడా ఒప్పందం కుదిరింది. ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ విజయానంద్ సూచనల మేరకు మూడు రోజులు పాటు పేపరుమిల్లు యాజమాన్యం, కార్మిక సంఘాల ప్రతినిధుల మధ్య జరిగిన చర్చలు సఫలమయ్యాయని విజయవాడ లేబర్ కమిషనర్ శేషగిరిబాబు తెలిపారు.అయితే స్థానిక సంఘాలు మాత్రం వ్యతిరేకి స్తున్నాయి. ఏరియర్స్ 50 రోజులకే ఇవ్వడానికే అంగీకరించారు. తాత్కాలిక ఉద్యోగులకు 50 శాతం జీతం పెంచాలని డిమాండ్ చేయగా యాజమాన్యం సుమారు 20 శాతం పెంచడానికి ముందుకొచ్చింది.ఈనేపథ్యంలో గురువారం కలెక్టర్‌ను కలుస్తామని యూని యన్ నాయకుడు సీపీఎం నేత అరుణ్ తెలిపారు.

మేధస్సుకు పరీక్ష



- విద్యార్థులకు జాతీయస్థాయిలో ప్రతిభాన్వేషణ పరీక్ష
- శాస్త్రీయ ఆలోచనలను పెంపొందించేలా కేంద్రం ప్రోత్సాహం
- 'విద్యార్థి విజ్ఞాన్ మంథన్'కు దరఖాస్తుకు 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు చదివే విద్యార్థులకు అవకాశం
- ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు సెప్టెంబరు 30 వరకు గడువు



అమలాపురంలో విద్యార్థి విజ్ఞాన్ మంథన్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు, అధికారులు

(అమలాపురం రూరల్-ఆంధ్రజ్యోతి)

విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక ఆలోచనలను ఆవిష్కరణల వైపు ప్రోత్సహించడంతోపాటు శాస్త్రీయ ఆలోచనలను పెంపొందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి. విద్యార్థులు పాఠశాలస్థాయి నుంచి పరిశోధనల్లో రాణించేలా ఏటా కేంద్ర ప్రభుత్వం విద్యార్థి విజ్ఞాన్ మంథన్ పేరుతో జాతీయస్థాయిలో ప్రతిభాన్వేషణ పరీక్ష నిర్వహిస్తోంది. కేంద్ర ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక సమాచార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈపరీక్షను ఎన్‌సీఈఆర్టీ, నేషనల్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ మ్యూజియం, విజ్ఞాన భారతి సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతున్న వారికి ఈ పరీక్ష నిర్వహిస్తారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు దేశ ప్రముఖ పరిశోధనా సంస్థల్లో ఇంటర్న్‌షిప్, ఉపకార వేతనాలు పొందే అవకాశం ఉంది.

సెప్టెంబరు 30 వరకు రిజిస్ట్రేషన్

విద్యార్థి విజ్ఞాన్ మంథన్ ప్రవేశపరీక్షలో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థులనుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ఈ ఏడాది ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైంది. సెప్టెంబరు 30 వరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు గడువు ఉంది. ప్రవేశ పరీక్ష ఆన్‌లైన్ పద్ధతిలో పాఠశాలస్థాయిలోనే నిర్వహిస్తారు. పరీక్ష జరిగేరోజు విద్యార్థులు వారికి అందుబాటులో ఉన్న ఆండ్రాయిడ్ మొబైల్, లాప్‌టాప్, డెస్క్‌టాప్, డిజిటల్ పరికరాల్లో ఏదైనా ఒకదాని ద్వారా పరీక్షకు నిర్దేశించిన దరఖాస్తును ప్లేస్టోర్ నుంచి డౌన్లోడ్ చేసుకుని వారి ఇంటి నుంచే పరీక్షకు హాజరయ్యే అవకాశం ఉంది.

రెండు విభాగాల్లో పరీక్ష..

పోటీ పరీక్షను జూనియర్, సీనియర్ విభాగాల్లో నిర్వహిస్తారు. 6వ తరగతి నుంచి 11వ తరగతి వరకు విడివిడిగా ఈ పరీక్ష నిర్వహిస్తారు. హిందీ, ఇంగ్లీషు భాషలతోపాటు దేశవ్యాప్తంగా ప్రాంతీయ భాషల్లో పరీక్ష రాసుకునే వెసులుబాటు ఉంది. మన విద్యార్థులు తెలుగు లేదా ఇంగ్లీషు భాషల్లో రాయవచ్చు. విద్యార్థి విజ్ఞాన్ మంథన్ పరీక్షకు సంబంధించి సెప్టెంబరు 1 నుంచి మాక్ పరీక్షలు నిర్వహిస్తారు. పాఠశాలస్థాయిలో ప్రధాన పరీక్ష అక్టోబరు 28 నుంచి 30 వరకు జరుగుతుంది. ఈ స్థాయిలో ఉత్తీర్ణులైన వారికి లెవెల్-2 ద్వితీయ పరీక్షను ఆన్‌లైన్‌లో ప్రోక్టరింగ్ విధానంలో పరిశీలకుల సమక్షంలో నవంబరు 19న జరుపుతారు.

ఆయా పరీక్షలను ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 6 గంటల మధ్య 90 నిమిషాల వ్యవధిలో రాయాల్సి ఉంటుంది. పరీక్ష రాసే ప్రతి విద్యార్థి యాప్‌లో ఒక్కసారి మాత్రమే లాగిన్ అవుతారు.

వంద మార్కులకు పరీక్ష

విద్యార్థి విజ్ఞాన్ మంథన్ పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలోనే ఉంటుంది. లెవెల్-1 ప్రధాన పరీక్షలో ఆయా తరగతులకు సంబంధించిన వంద ప్రశ్నలు ఉంటాయి. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు చొప్పున వంద మార్కులు కేటాయిస్తారు. సెక్షన్-ఎలో విజ్ఞాన శాస్త్ర రంగంలో భారతీయ మేధావుల కృషిపై 20ప్రశ్నలు, సత్యేంద్రనాథ్‌బోస్ జీవితచరిత్ర నుంచి 20ప్రశ్నలు, సెక్షన్-బిలో 6 నుంచి 11 తరగతులకు సంబంధించి విద్యార్థులకు గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయోలజీ సబ్జెక్టుల నుంచి 50 ప్రశ్నలు, లాజిక్, రీజనింగ్ బుక్‌కు సంబంధించి 10ప్రశ్నలు ఉంటాయి. మొదటి విభాగంలో ఉత్తీర్ణులైన వారికి లెవెల్-2 ద్వితీయ పరీక్షలో 50 ప్రశ్నలు వంద మార్కులకు ఉంటాయి.

రాష్ట్రస్థాయికి ఎంపిక చేసేదిలా..

పాఠశాల స్థాయిలో ప్రాథమిక పరీక్ష రాసిన విద్యార్థుల్లో తరగతుల వారీగా ప్రతిభ చూపిన మొదటి 25మందిని ఎంపిక చేస్తారు. 6 నుంచి 11 తరగతులకుగాను మొత్తం 150మందిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తారు. అందులో ప్రతిభ చూపిన ప్రతి తరగతి నుంచి ముగ్గురు చొప్పున మొత్తం 18మందిని జాతీయస్థాయికి ఎంపిక చేస్తారు. రాష్ట్రస్థాయి పరీక్ష డిసెంబరు 21, 28 తేదీల్లోగానీ జనవరి 4నగానీ ఏదో ఒకరోజు రాయాల్సి ఉంటుంది. రాష్ట్రస్థాయిలో ప్రతి తరగతినుంచి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.5వేలు, రూ.3వేలు, రూ.2వేలతోపాటు మెమెంటో, సర్టిఫికెట్లను అందజేస్తారు. రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్న ప్రతి విద్యార్థికి మెమెంటో, ప్రశంసాపత్రం అందజేస్తారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక ఇలా..

రాష్ట్రస్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన ప్రతి తరగతి నుంచి మొదటి ఇద్దరు విద్యార్థులు వంతున 12మందిని ప్రతి రాష్ట్రం నుంచి జాతీయస్థాయికి ఎంపిక చేస్తారు. అందులో ప్రతి తరగతిలో ప్రతిభ చూపిన మొదటి ముగ్గురు విద్యార్థుల చొప్పున 18మందిని జాతీయస్థాయి విజేతలుగా ప్రకటిస్తారు. జాతీయస్థాయి విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.25వేలు, ద్వితీయ బహుమతి రూ.15వేలు, తృతీయ బహుమతిగా రూ.15వేలతోపాటు మెమెంటో, ప్రశంసాపత్రాలు అందజేస్తారు. నెలకు రూ.2వేల చొప్పున సంవత్సరంపాటు భాస్కర ఉపకార వేతనం కింద, రూ.24వేలు అందజేస్తారు. విద్యార్థి విజ్ఞాన్ మంథన్ 2025-26లో జాతీయ, జోనల్‌స్థాయి విజేతలుగా నిలిచిన విద్యార్థులకు డీఆర్డీవో, ఇస్రో, సీఎస్ఐఆర్, బీఏఆర్సీ మొదలైన ప్రఖ్యాత జాతీయ ప్రయోగశాలలు, పరిశోధనా సంస్థల్లో ఒకటినుంచి మూడువారాలపాటు ప్రత్యేక శిక్షణ, ఇంటర్న్‌షిప్ కార్యక్రమం నిర్వహిస్తారు.

సృజనాత్మకతను వెలికితీయొచ్చు

-జీవీఎస్ సుబ్రహ్మణ్యం, జిల్లా సైన్స్ అధికారి



విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు విద్యార్థి విజ్ఞాన్ మంథన్ చక్కటి వేదికగా నిలుస్తుంది. సైన్స్ పట్ల అభిరుచిని పెంపొందించడంతో పాటు వారిని శాస్త్రవేత్తలుగా తయారు చేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టింది. ఈ పరీక్షను ప్రభుత్వ, ఇతర యాజమాన్య ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు కూడా రాసుకునే అవకాశం కల్పించారు.

పాఠశాలనుంచి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు

-షేక్ సలీంబాషా, డీఈవో, కోనసీమ జిల్లా



విద్యార్థులు వ్యక్తిగతంగానే కాకుండా పాఠశాల నుంచి కూడా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. పరీక్ష రాయడానికి ఆసక్తి ఉన్న విద్యార్థులను ఉపాధ్యాయులు ప్రోత్సహించాలి. www.vvm.org.in వెబ్‌సైట్‌లో లాగిన్ అవ్వాలి. ప్రతి విద్యార్థి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. పోటీతత్వాన్ని పాఠశాలస్థాయినుంచి పెంపొందించుకునేందుకు పరీక్ష దోహదపడుతుంది.



కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో ప్రాక్టీస్‌లో పాల్గొన్న హాకీ క్రీడాకారులు

మహా క్రీడా సంబరానికి సర్వం సిద్ధం

- కాకినాడలో రేపటి నుంచి 15వ హాకీ జూనియర్ ఉమెన్స్ నేషనల్ చాంపియన్‌షిప్-2025 పోటీలు
- 1నుంచి 12 వరకు మ్యాచ్‌లు
- పాల్గొననున్న 30 రాష్ట్రాల జట్లు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

మహా క్రీడాసంబరానికి, ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ ఇలా రెండు ప్రధాన కార్యక్రమాలకు కాకినాడ ముస్తాబవుతోంది. ఆగస్టు 1వతేదీ నుంచి 12 వరకు కాకినాడ జిల్లా క్రీడామైదానంలో జరిగే 15వ హాకీ జూనియర్ ఉమెన్స్ నేషనల్ చాంపియన్‌షిప్-2025 పోటీలకు జోరుగా ఏర్పాట్లు సాగుతున్నాయి. ఆగస్టు 3 నుంచి 20 వరకు జరిగే ఆర్మీ రిక్రూట్‌మెంట్‌కు సంబంధించి ర్యాలీ, వివిధ సామర్థ్య పరీక్షలు ఇక్కడ నిర్వహిస్తున్నారు.

పూర్తికావొచ్చిన ఏర్పాట్లు

జాతీయస్థాయి మహిళల జూనియర్ హాకీ పోటీలకు 30 స్టేట్ టీమ్స్ పాల్గొననున్నాయి. ఇప్పటికే కొన్ని టీమ్‌లు కాకినాడ చేరుకున్నాయి. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో ఆస్ట్రో టర్ఫ్ హాకీ ఫీల్డ్ ఉండడంతో గతంలో రెండుసార్లు జాతీయ పోటీలు ఇక్కడ విజయవంతంగా నిర్వహించారు. కలెక్టర్ షాన్‌మోహన్, జేసీ రాహుల్‌మీనా, డీఆర్వో వెంకటరావు, డీఎస్‌డీవో శ్రీనివాస్ నెలరోజులుగా ఈ పోటీల నిర్వహణ ఏర్పాట్ల కోసం శ్రమిస్తున్నారు. వచ్చేక్రీడాకారులకు ఏడుచోట్ల వసతి ఏర్పాట్లు చేశారు. క్రీడల నిర్వహణకు 38మంది జిల్లా విద్యాశాఖ పీడీలను ఏర్పాటు చేశారు. ప్రతి జట్టుకు 18మంది క్రీడాకారులు ఉంటారు. మెడికల్, మున్సిపాలిటీ, రెవెన్యూ, డీ ఎస్ఏ సిబ్బంది కలిపి 200మంది వరకు సేవలందించనున్నారు.

లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో..

మహిళల హాకీ పోటీలు లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో జరగనున్నాయి. సీ డివిజన్, బీ డివిజన్, ఏ డివిజన్ ఇలా వరుసగా పోటీలు నిర్వహిస్తారు. 12న హాకీ ఇండియా హయ్యర్ అఫీషియల్స్ రానున్నారు. రోజుకు 8మ్యాచ్‌లు జరుగుతాయి. ప్రతిరోజూ ఉదయం 5.30 గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు షెడ్యూల్ ప్రకారం పోటీలు జరుగుతాయి.

హాకీ పోటీలకు ఏర్పాట్లు పూర్తి చేశాం

హాకీఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో,ఏపీ స్పోర్ట్స్ అథారిటీ, జిల్లా అడ్మినిస్ట్రేషన్ సంయుక్తంగా ఆగస్టు 1 నుంచి నిర్వహించే జాతీయస్థాయి హాకీ పోటీలకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశాం. ఈ పోటీలను రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి, శాప్ ఛైర్మన్ ఈ పోటీలను ప్రారంభించనున్నారు. ఈ పోటీల ద్వారా జూనియర్ వరల్డ్‌కప్ ఉమన్ హాకీ టీమ్‌ను ఎంపిక చేస్తారు.

-రవిరాజు, సంయుక్త కార్యదర్శి, రాష్ట్ర హాకీ అసోసియేషన్

ఏయే డివిజన్‌లో ఏయే టీమ్‌లు

డివిజన్-'ఏ'..

డివిజన్-'ఏ'లో. నాలుగు పూల్స్ ఉంటాయి.

పూల్-ఏ: జార్ఖండ్, చత్తీస్‌ఘర్, కర్నాటక

పూల్-బీ: మధ్యప్రదేశ్,పంజాబ్, చండీఘర్

పూల్-సీ: హర్యానా, ఉత్తరప్రదేశ్, బెంగాల్,

పూల్-డీ: ఒడిశా, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్

డివిజన్-'బి'..

డివిజన్ 'బి'లో రెండు పూల్స్ ఉంటాయి

పూల్-ఏ: మణిపూర్, పుదుచ్చేరి, ఉత్తరాఖండ్, కేరళ, అస్సాం

పూల్-బీ: హిమాచల్, ఢిల్లీ, తమిళనాడు, అరుణాచల్ ప్రదేశ్, బీహార్

డివిజన్-'సి'..

డివిజన్-సీలో రెండు పూల్స్ ఉంటాయి.

పూల్-ఏ: దాద్రానగర్ హవేలీ, డామన్ అండ్ డయ్యూ, జమ్మూ అండ్ కశ్మీర్, గోవా, త్రిపుర జట్లు

పూల్-బీ: గుజరాత్, రాజస్థాన్, మిజోరం, తెలంగాణ

హాకీ క్రీడాకారులకు వసతి కేంద్రాలు

క్రీడాకారుల కోసం ఏడుచోట్ల వసతి సౌకర్యాలు ఏర్పాటు చేశారు. సామర్లకోటలోని ఈటీసీ శిక్షణకేంద్రం, సర్వే ట్రైనింగ్ అకాడమీ, టీటీడీసీ క్యాంపస్, కాకినాడ బాలాజీచెరువు సెంటర్ వద్ద ఉన్న అంబేడ్కర్ హాస్టల్ భవనం, జేఎన్‌టీయూకే ఉమెన్స్ హాస్టల్, అశోక్‌నగర్‌లోని జీపీటీ హాస్టల్, శ్యామ్ ఇనిస్టిట్యూట్, అచ్చంపేటలోని ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ క్యాంపస్‌ల్లో వారికి ఏర్పాట్లు ఉన్నాయి.

ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ

ఆగస్టు 3 నుంచి 20 వరకు జరిగే ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ నిర్వహణకు ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి. శ్రీకాకుళం జిల్లా నుంచి ఎన్టీఆర్ జిల్లా వరకు 12జిల్లాల నుంచి అభ్యర్థులు ఈ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీలో పాల్గొననున్నారు. ఇప్పటికే ఆర్మీ ఎంపిక పరీక్ష రాసి ఉత్తీర్ణులైన అభ్యర్థులకు ఎంపిక ప్రక్రియ ఇక్కడ జరగనుంది. రోజుకు 800మంది ఈ రిక్రూట్‌మెంట్‌లో పాల్గొంటారు. అభ్యర్థులకు ముందుగా నెంబర్లు కేటాయించి 100మంది చొప్పున 1.6 కె.ఎం రన్నింగ్ పరీక్ష, అనంతరం మెడికల్ పరీక్షలు నిర్వహిస్తారు. 20రోజుల పాటు జరిగే ఈ రిక్రూట్‌మెంట్ ప్రక్రియలో 15వేలమంది పాల్గొనే అవకాశం ఉంది. ఆర్మీ అభ్యర్థులకు స్పోర్ట్స్ అథారిటీ ఆవరణలోనే వసతి కల్పించనున్నారు. ఆగస్టు 5 నుంచి అభ్యర్థుల ఎంపిక ప్రారంభం కానుంది.




హమ్మయ్య... గొంతు తడిసింది!

దాహార్తితో ఉంటే కళ్లెదుట ఏ నీరు కనిపిస్తే అదే అమృతం. అది మనుషులకైనా, జంతువులైనా. ఇక్కడ కనిస్తున్న దృశ్యం అదే విషయాన్ని ఆవిష్కృతం చేసింది. దాహంతో అలమటిస్తున్న ఆవుకు కాకినాడ జిల్లా గొల్లప్రోలు వాటర్ వర్క్స్‌లోని ఓవర్‌హెడ్ రిజర్వాయర్ పైపు నుంచి కారుతున్న నీటి ధార కనిపించింది. అక్కడకు చేరుకుని పైపు నుంచి వచ్చే నీటితో నాలుక తడుపుకుంది. బుధవారం సాయంత్రం కనిపించిన ఈ దృశ్యాలను 'ఆంధ్రజ్యోతి' క్లిక్ మనిపించింది.

... గొల్లప్రోలు (ఆంధ్రజ్యోతి)


లడ్డు ప్రసాదాన్ని పరిశీలిస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు నందాజీ, రామయ్య

వాడపల్లి వెంకన్న ఆలయంలో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు

ఆత్రేయపురం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం ఫుడ్ సేఫ్టీ అధికారుల బృందం తనిఖీలు నిర్వహించింది. ఉభయ గోదావరి జిల్లాల అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ బీఏబీ నందాజీ, జిల్లా ఫుడ్ సేఫ్టీ డిజిగ్నేటెడ్ ఆఫీసర్ వై.రామయ్య లడ్డు, పులిహోర తయారీ కేంద్రాలను పరిశీలించారు. అన్నదాన సత్రంలో అన్నప్రసాదం తయారీతో పాటు అక్కడ సౌకర్యాలను చూశారు. లడ్డు, పులిహోర ఎలా ఉంటున్నాయని భక్తులను ఆరా తీశారు. జల ప్రసాదం ఆర్వో ప్లాంటును పరిశీలించారు. అనంతరం అధికారులు స్వామివారిని దర్శించుకున్నారు. వారికి వేద పండితులు ఆశీర్వచనం ఇవ్వగా ఈవో చక్రధరరావు స్వామివారి చిత్రపటాలను అందజేశారు.


అన్నప్రసాదం ఎలా ఉందని భక్తుడిని అడిగి తెలుసుకుంటున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు. చిత్రంలో ఈవో సూర్యచంద్రరావు

చట్టసభల్లో వాటా కోసం యాదవులంతా ఏకమై

పోరాటం చేయాలి

జాతీయ అధ్యక్షుడు బుసగాని లక్ష్మయ్య పిలుపు


అఖిల భారత యాదవ సంఘం ఉమ్మడి జిల్లా నూతన కార్యవర్గం

కాకినాడ సిటీ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత యాదవ సంఘం ఉమ్మడి జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాకినాడ జగన్నాథపురంలోని గొల్లపేట యాదవ కమ్యూనిటీ హాలులో బుధవారం ఉమ్మడి జిల్లా సంఘ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన జాతీయ అధ్యక్షుడు బుసగాని లక్ష్మయ్య మాట్లాడుతూ ఐక్యతతో ఎటువంటి హక్కులనైనా సాధించుకోగలమన్నారు. చట్టసభల్లో వాటాకోసం యాదవులంతా ఏకమై పోరాటం సాగించాలన్నారు. రాజ్యాధికారం దక్కినప్పుడే ఆర్థికంగా, రాజకీయంగా యాదవులు ఎదుగుతారన్నారు. అనంతరం ఉమ్మడి జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా యనమల రాజేష్, మన్నే కాశీవిశ్వేశ్వరరావు, అధ్యక్షుడిగా మన్నే నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా గింజాల రామకృష్ణ, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ అందరినీ కలుపుకుని యాదవుల సంక్షేమానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొడ్డు రమేష్, రాష్ట్ర రాజకీయ వ్యవహారాల చైర్మన్ గౌరుపర్తి శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వెంకటముని, రాష్ట్ర కార్యదర్శి కుప్పం రవిశంకర్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వీర్ల వెంకట సత్యనారాయణ, ప్రచార కార్యదర్శి చాట్ల మునిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఐటీ సెజ్‌ల్లో ఉద్యోగుల నివాస గృహాలకు స్థలాలు కేటాయించాలి

లోక్‌సభ జీరో అవర్‌లో ప్రస్తావించిన కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్

కలెక్టరేట్ (కాకినాడ), జూలై 30 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఐటీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై పార్లమెంటు సమావేశాల్లో కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ గళమెత్తారు. ఐటీ రంగాన్ని అభివృద్ధి చేసే లక్ష్యంతో దేశవ్యాప్తంగా ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటుచేస్తున్న ప్రత్యేక ఆర్థిక మండళ్ల (సెజ్)లో ఐటీ ఉద్యోగులకు ప్రత్యేకంగా నివాస గృహాల కోసం స్థలాలు కేటాయించాలని కోరారు. లోక్‌సభలో జీరో అవర్‌లో ఆయన ఈ అంశాన్ని లేవనెత్తారు. ఐటీ సేవల ఎగుమతుల్లో ప్రపంచంలోనే మన దేశం అగ్రగామిగా నిలుస్తోందన్నారు. 2005లో 23 బిలియన్ డాలర్లు కాగా 2025 నాటికి 200 బిలియన్ డాలర్లకు పెరిగిందన్నారు. 50లక్షల మందికి పైగా ఉద్యోగ అవకాశాలు లభించాయన్నారు. బెంగళూరు, హైదరాబాద్, గుర్గావ్, పూణే, చెన్నై నగరాల్లో ఐటీ శరవేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. అక్కడ పనిచేసే ఉద్యోగులకు నివాసం పెను సమస్యగా ఉందన్నారు. ఈ నేపథ్యంలో ఐటీ ఉద్యోగులకు గృహాల నిర్మాణానికి స్పష్టమైన జాతీయ మార్గదర్శకాలు జారీ చేయాలని ఎంపీ కోరారు.



కేంద్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక సంస్థ అయిన నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీని కాకినాడ జిల్లా పిఠాపురంలో ఏర్పాటు చేయాలని కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ కోరారు. బుధవారం ఆయన న్యూఢిల్లీలో కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి కనుమూరి శ్రీనివాసవర్మ, రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ పాల్గొన్నారు.

తగ్గుతున్న గోదావరి ఉధృతి

- డెల్టా కాలువలకు పెరిగిన నీటి విడుదల
- 661 టీఎంసీల నీరు సముద్రంలోకి

ధవళేశ్వరం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): గోదావరి ఉధృతి క్రమంగా తగ్గుముఖం పడుతోంది. కాటన్ బ్యారేజ్ ధవళేశ్వరం, ర్యాలి ఆర్మ్‌ల్లోని మొత్తం గేట్ల 1.5 మీటర్లు, మద్దూరు, విజ్జేశ్వరం ఆర్మ్‌ల్లోని మొత్తం గేట్లను ఒక మీటరు మేర పైకి ఎత్తి 5,14,117 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో ధవళేశ్వరం వద్ద నీటిమట్టం 10 అడుగులుగా నమోదైంది. ఎగువున భద్రాచలం వద్ద తగ్గుముఖం పట్టిన నీటిమట్టం బుధవారం సాయంత్రానికి 31.2 అడుగులకు చేరుకుంది.

వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో వరినాట్లు ప్రారంభమైన దశలో వ్యవసాయ అవసరాలకు డెల్టా కాలువలకు నీటి విడుదలను పెంచారు. కాటన్ బ్యారేజీ నుంచి తూర్పు డెల్టాకు 4,800 క్యూసెక్కులు, మధ్య డెల్టాకు 2,600 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 7,000 క్యూసెక్కులు చొప్పున మొత్తం 14,400 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

గోదావరికి వరద సీజను ప్రారంభమై జూన్, జూలైల్లో ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ నుంచి మొత్తం 661.82 టీఎంసీలను సముద్రంలోకి వృథాగా వదిలి వేశారు. జూన్‌లో వచ్చిన నీరు వ్యవసాయ అవసరాలకు పోను 10 టీఎంసీల మేర సముద్రంలోకి ప్రవహించింది. జూలైలో గోదావరికి రెండుసార్లు ఎగువ నుంచి 6లక్షల క్యూసెక్కులకు పైగా వరద ప్రవాహం తరలివచ్చింది. ఒక మోస్తరుగా తరలివచ్చిన వరదకే 650కిపైగా టీఎంసీలు సముద్రంలోకి పోయింది. ఈ నీటితో 60లక్షల ఎకరాలకు సాగునీరు, గ్రామాలకు తాగునీరు అందించవచ్చు.




మేఘ సందేశం!

తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం నగరంలోని గోదావరి నదిపై... కోటిలింగాల రేవు వద్ద బుధవారం సాయంత్రం మబ్బులు ఇలా అందంగా కమ్ముకున్నాయి. వీటిని చూసినవారికి ఎండను తగ్గించి చల్లని వాతావరణం ఇచ్చేందుకు వచ్చాం అనే సందేశం ఇచ్చినట్టు అనిపిస్తుందంటే అతిశయోక్తి కాదేమో. - స్టాఫ్ ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం

సత్యదేవుడి హుండీల ఆదాయం
రూ.1.57 కోట్లు

అన్నవరం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధిలోని హుండీలలో భక్తులు సమర్పించిన కానుకలను బుధవారం లెక్కించగా రూ.1,57,09,001 నగదు, 35 గ్రాముల బంగారం, 659 గ్రాముల వెండి సమకూరాయి. వీటితో పాటుగా యూఎస్ఏకు చెందిన 125 డాలర్లు, ఇంగ్లాండ్ 20 పౌండ్స్, సింగపూర్ 30 డాలర్లు, యుఏఈ 90 దిరహమ్స్, రష్యన్ 50 రూబీలు లభించాయి. లెక్కింపును ఈవో సుబ్బారావు, చైర్మన్ రోహిత్ పర్యవేక్షించగా సిబ్బంది, స్వచ్ఛంధ సేవకులు పాల్గొన్నారు. 35 రోజులకు ఈ ఆదాయం లభించగా సరాసరిన రోజుకు రూ.4.48 లక్షల ఆదాయం హుండీలలో భక్తులు సమర్పించుకున్నారు.



హుండీలలో కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

టిప్పర్ లారీ ఢీకొని వ్యక్తి దుర్మరణం

రాజానగరం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): టిప్పర్ లారీ డ్రైవర్ నిర్లక్ష్యం, అతివేగం వల్ల వ్యక్తి దుర్మరణం చెందాడు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని కోటిలింగాలపేటకు చెందిన బత్తుల చిట్టిరాజు (52) గుమ్మళ్లదొడ్డిలోని పీఎంఏజే ఇండస్ట్రీస్ లిమిటెడ్ కంపెనీలో మెకానికల్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నేపథ్యంలో రోజూ మాదిరిగానే బుధవారం ఇంటి నుంచి ఆఫీస్‌కు మోటార్‌సైకిల్‌పై బయలుదేరిన చిట్టిరాజును మార్గమధ్యంలో కొంతమూరు కళ్యాణ్‌నగర్ వద్ద అతివేగం, నిర్లక్ష్యంగా వస్తున్న టిప్పర్‌లారీ వెనుకవైపు నుంచి బలంగా ఢీకొని కొంతదూరం ఈడ్చుకుంటూ వెళ్లిపోయింది. చిట్టిరాజు లారీ చక్రాల మధ్యలో ఇరుక్కుపోయి నుజ్జునుజ్జయ్యి మరణించాడు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు రాజానగరం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి భార్య లీల ఫిర్యాదుతో రాజానగరం ఎస్ఐ ప్రియకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఫైల్‌ఫొటో



లారీ చక్రాల మధ్యలో చిట్టిరాజు మృతదేహం

భవనంపై నుంచి పడి పెయింటర్ మృతి

సీతానగరం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం చినకొండేపూడి గ్రామంలో భవనం పై పెయింట్ పనిచేస్తుండగా ప్రమాదవు శాత్తు కింద పడి వంగలపూడి గ్రామానికి చెందిన అల్లం సతీష్ జ్ఞానకుమార్ (46) మృతిచెందాడు. సీతానగరం హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపిన వివరాల మేరకు.. బుధవారం చినకొండేపూడిలో అడపా తిరుపతిరావు ఇంటి పై అంతస్తుకు ఫరంజీలు కట్టుకుని దానిపై నిలబడి పెయింటింగ్ వేస్తుండగా ప్రమాదవుశాత్తు ఫరంజి తెగిపోవడంతో పై నుంచి రోడ్డుపై పడి జ్ఞానకుమార్ తలకు తీవ్ర గాయమైంది. తోటి పనివారు కుటుంబ సభ్యులకు తెలియపరిచి చికిత్స నిమిత్తం స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మరణించినట్టు వైద్యులు ధృవీకరించారు. జ్ఞానకుమార్ భార్య అల్లం దేవి భవాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించినట్టు ఎస్ఐ తెలిపారు.



మృతిచెందిన జ్ఞానకుమార్

పేలిన గ్యాస్ సిలిండర్

భీమక్రోసుపాలెంలో వ్యక్తి పరిస్థితి విషమం

ద్రాక్షారామ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం భీమక్రోసుపాలెంలో మంగళవారం రాత్రి అనిశెట్టి సుబ్బలక్ష్మీ ఇంటి స్టోర్‌రూమ్‌లో గ్యాస్ సిలిండర్ పేలింది. ఫైర్ అధికారులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలో అనిశెట్టి సుబ్బలక్ష్మీ చెందిన ఇంటి వంటగదికి చేర్చి మేడమెట్ల కింద స్టోర్‌రూమ్‌లో విద్యుత్‌మీటరు, కట్టెల పొయ్యి ఉంది. గదిలో కట్టెలు, పూర్తి గ్యాస్ నిండి ఉన్న అదనపు సిలిండర్ ఉన్నాయి. రాత్రి 11 గంటల ప్రాంతంలో స్టోర్ రూమ్‌లో మంటలు చెలరేగాయి. దీంతో సమీపంలో ఉన్నవారు కేకలు వేయడంతో ఇంట్లో నుంచి సుబ్బలక్ష్మీ, కుటుంబీకులు బయటకు వచ్చేశారు. మంటల్లో గ్యాస్ సిలిండర్ ఉండటంతో ఒక్కసారిగా పేలిపోయింది. వారికి సాయం చేసేందుకు వెళ్లిన పితాని చినబాబు తీవ్రంగా గాయపడ్డాడు. అగ్నిమాపకదళ అధికారి కె.వెంకటరెడ్డి ఘటనా స్థలానికి చేరుకున్నారు. చినబాబును కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్నట్టు చెప్తున్నారు. పేలుడు ధాటికి ఇంటి వంటగది గోడలు ధ్వంసమై మేడమెట్లు కూలిపోయాయి. రూ.2 లక్షల నష్టం సంభవించినట్టు చెప్తున్నారు.



సిలిండర్ పేలుదుకు ధ్వంసం అయిన ఇంటి గోడలు

చెరువులో పడి వ్యక్తి మృతి



జగ్గంపేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా జగ్గంపేట మంచి నీటి చెరువులో పడి వ్యక్తి మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జగ్గంపేట టవర్ కాలనీకి చెందిన ఇల్ల డేవిడ్‌రాజ్ (40) పంచాయతీ కార్యాలయంలో పారిశుధ్య సిబ్బందిగా పని చేస్తున్నాడు. మద్యం తాగి చెరువులో పడిపోవడంతో మృతి చెందాడని స్థానికులు తెలిపడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం పెద్దాపురం తరలించారు. కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

చింతూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని మృతదేహం లభ్యమైనట్టు ఎస్ఐ రమేష్ తెలిపారు. బుధవారం తమకు అందిన సమాచారం మేరకు అల్లూరి జిల్లా చింతూరు మండలం కల్లేరు సీలేరు నది ఒడ్డున మృతదేహం ఉన్నట్టు గుర్తించామన్నారు. మృతదేహంపై గులాబీ రంగు టీషర్టు, బూడిద రంగు షార్ట్ ఉన్నాయని.. మృతుడికి 30 నుంచి 35 ఏళ్లు ఉండవచ్చన్నారు. కేసు నమోదు చేశామన్నారు. ఎవరికైనా వివరాలు తెలిస్తే చింతూరు పోలీసు స్టేషన్లో సంప్రదించాల్సిందిగా ఎస్ఐ కోరారు.

చోరీ కేసుల్లో ఇద్దరి అరెస్టు

63 గ్రాముల బంగారం స్వాధీనం

అన్నవరం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కత్తిపూడిలో ఈఏడాది జనవరి నెలాఖరున జరిగిన రెండు వేర్వేరు చోరీ కేసుల్లో నిందితులను బుధవారం అన్నవరం ఎస్ఐ హరిబాబు కత్తిపూడిలో అరెస్టు చేశారు. నర్సీపట్నం మండలం కె.ఎల్ పురానికి చెందిన గెడ్డం రామ్ నవీన్, నర్సీపట్నంకు చెందిన మారి అలెక్స్ చెడు అలవాట్లకు బానిసై చోరీల బాటపట్టారని పేర్కొన్నారు. వారిని అరెస్ట్ చేసి 63 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ తెలిపారు. మరో నిందితుడు రౌతు మల్లేష్‌ను అరెస్టు చేయాల్సి ఉందని చెప్పారు.



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ హరిబాబు

కీచక కరస్పాండెంట్ అరెస్ట్



రాయవరం పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడిస్తున్న ట్రైనీ డీఎస్పీ, సీఐ

రాయవరం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థినిని బెదిరించి లోబర్చుకుని గర్భవతిని చేసిన కీచక స్కూల్ కరస్పాండెంట్ ఆకుమర్తి జయరాజ్‌ను అరెస్టు చేసినట్టు ట్రైనీ డీఎస్పీ ప్రదీప్తి తెలిపారు. బుధవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. సోమేశ్వరం శివారు రెడ్డి కృష్ణమ్మపేటకు చెందిన ఆకుమర్తి జయరాజ్ రాయవరం మండలంలోని ఓ గ్రామంలో స్కూల్ నిర్వహిస్తున్నాడు. అదే స్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న బాలికను ఈ ఏడాది మార్చి 26న తన ఆఫీసు రూమ్‌లోకి పిలిపించుకుని అలమారలో ఫైల్స్ తీయమని చెప్పాడు. తర్వాత నోరునొక్కి కేకలు వేస్తే చంపేస్తానని బెదిరించి అత్యాచారానికి పాల్పడ్డాడు. బాలికకు నెలసరి రాకపోవడంతో ఈనెల 28న తల్లిదండ్రులు వైద్య పరీక్షలు చేయించగా గర్భవతి అని తేలింది. దీంతో బాలిక తల్లిదండ్రులు రాయవరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని బుధవారం రామచంద్రపురం మండలం కొత్తూరు శివారు జంక్షన్ వద్ద వీఆర్వో సమక్షంలో అదుపులోకి తీసుకున్నట్టు డీఎస్పీ తెలిపారు. సమావేశంలో మండపేట రూరల్ సీఐ పి.దొరరాజు, ఎస్ఐ డి.సురేష్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు. నిందితుడిని అరెస్టు చేసిన ట్రైనీ డీఎస్పీ, సీఐ, ఎస్ఐలను కోనసీమ జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు, అదనపు ఎస్పీ ఏవీఆర్‌బీ ప్రసాద్, డీఎస్పీ రఘువీర్ తదితరులు అభినందించారు.

భార్యను హతమార్చిన భర్త అరెస్ట్

రాజానగరం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): భార్యను విచక్షణా రహితంగా నాపరాయితో తలపై మోది కడతేర్చిన భర్తను రాజానగరం పోలీసులు అరెస్టు చేశారు. తూర్పుగోదావరి జిల్లా కొంతమూరు సంతోష్‌నగర్‌లో ఈ నెల 27న జరిగిన మహిళ హత్య కేసు వివరాలను రాజానగరం పోలీస్‌స్టేషన్‌లో బుధవారం నార్త్ జోన్ డీఎస్పీ వై.శ్రీకాంత్ స్థానిక సీఐ ఎస్.ప్రసన్న వీరయ్య గౌడ్‌తో కలిసి వెల్లడించారు. వేమగిరి ఉషారాణి అలియాస్ చిన్నారి(28)కి సుమారు పదేళ్ల కిందట నర్సీపట్నం దగ్గరలోని గిడుతురు గ్రామానికి చెందిన వేమగిరి మాణిక్యంతో వివాహం జరిగింది. వారికి కుమారుడు, కుమార్తెలు ఉన్నారు. వివాహం అయినప్పటి నుంచి భార్య పిల్లలు కొంతమూరు సంతోష్‌నగర్‌లోనే అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. మాణిక్యం వెల్డింగ్ పనిచేసేవాడు. ఈనేపథ్యంలో ఉషారాణిపై అనుమానంతో మాణిక్యం తరచూ వేధింపులకు గురిచేసేవాడు. ఈ విషయమై నెలరోజుల కిందట రాజానగరం పోలీస్‌స్టేషన్‌లో భార్యభర్తల గొడవ కేసు నమోదు చేశారు. ఉషారాణి కేసు పెట్టినప్పటీ నుంచి మాణిక్యం కుంటుంబాన్ని పట్టించుకోకుండా సరిగ్గా ఇంటికి రాకుండా అక్కడక్కడా తిరుగుతూ భార్యపై అనుమానం మరింత ఎక్కువ పెంచుకున్నాడు. దీంతో ఈ నెల 26న రాత్రి 11.30 గంటల సమయంలో ఇంటికి వచ్చి భార్యతో గొడవపడి నాపరాయితో ముఖంపై బలంగా కొట్టి హతమార్చి పరారయ్యాడు. ఈ మేరకు ఉషారాణి తల్లి నలమాటి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నిందితుడు మాణిక్యంను 28న సాయంత్రం అరెస్టు చేశారు. నిందితుడిని పట్టుకున్న సీఐ ప్రసన్న వీరయ్య గౌడ్‌తో పాటుగా ఎస్ఐ కెవి నాగార్జున, ఎస్ఐ నారాయణమ్మ, సిబ్బంది నరేష్‌బాబు, రాంప్రసాద్, అశోక్‌లను ఎస్పీ నరసింహకిషోర్ అభినందించారు.



రాజానగరం పోలీస్ స్టేషన్‌లో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీకాంత్, సీఐ

చిరు వ్యాపారి ఆత్మహత్యాయత్నం

నల్లజర్ల, జూలై 30 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా దూబచర్ల డైట్ కళాశాలకు వెళ్లే మార్గం వద్ద ఓ చిన్న దుకాణం నడుపుతున్న దొబ్బడి పెద్దిరాజు బుధవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గత 15 ఏళ్లుగా ఇక్కడే పాన్ షాపు నిర్వహిస్తున్నాడు. బుధవారం పంచాయతీ కార్యదర్శి ఆశ అలైఖ్య పోలీసు సిబ్బందితో ఆ ప్రాంతాన్ని ఖాళీ చేసే ప్రయత్నం చేయగా తన జీవనాధారం పోతుందని ఇంటికి వెళ్లి పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు వెంటనే నల్లజర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్య నిమిత్తం తాడేపల్లిగూడెం ఆసుపత్రికి తరలించారు. దీనిపై కార్యదర్శి ఆశ అలైఖ్యను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా కొట్టు వద్ద చెట్టు ఉండడం వల్ల వాహనరాకపోకలకు అంతరాయం ఏర్పాడుతుందని గ్రామానికి చెందిన కొంతమంది ఫిర్యాదు చేయడంతో అనేకసార్లు చెట్టు కొమ్మలను తొలగించాలని చెప్పినాపట్టించుకోలేదన్నారు. లైన్‌మెన్, పోలీసులు చెట్టును తొలగించేందుకు వెళ్లగా కొట్టు తీసేస్తున్నారని చెప్పి అబద్ధాలు చెప్పాడన్నారు. ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించినట్టు ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న దొబ్బడి పెద్దిరాజు

దాడి కేసులో వ్యక్తికి ఏడేళ్ల జైలు శిక్ష

రాజమహేంద్రవరం సిటీ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కడియం పోలీస్ స్టేషన్ పరిధిలో మాధవరాయుడు పాలెంలో బొల్లా ధనుంజయ అలియాస్ డీజేఎస్‌పై డ్రింక్ సీసాతో దాడి చేసిన ముంజేటి సురేష్ అనే వ్యక్తిపై నేరం రుజువు కావడంతో ఏడు సంవత్సరాల జైలు శిక్ష విధిస్తూ రాజమహేంద్రవరం ఎనిమిదో అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి వై.బెన్నయ్యనాయుడు తీర్పునిచ్చారు. 2024లో జరిగిన ఈ సంఘటనపై అప్పట్లో కడియం పోలీసులు కేసు నమోదు చేశారు. మద్యం మత్తులో సురేష్ ఈ దాడి చేసినట్టు అప్పటి సీఐ టి.కృష్ణసాయి కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ ఫైల్ చేశారు. ఈ కేసులో సాక్షులను ప్రస్తుత కడియం సీఐ ఎ.వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో కోర్టు కానిస్టేబుల్ కే.శ్రీనివాస్ కోర్టులో హాజరుపరిచారు. అడిషనల్ పీపీ కే.రాధాకృష్ణరాజు వాదన వినిపించారు. న్యాయమూర్తి తుది తీర్పును వెల్లడించారు. నిందితుడికి ఏడు సంవత్సరాలు జైలు శిక్ష, రూ.5వేలు జరిమానా విధించారు.

మహిళను వేధించిన ఇద్దరిపై కేసు

రాజమహేంద్రవరం సిటీ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మహిళను వేధించిన కేసులో ఇద్దరిపై బొమ్మూరు పోలీసులు కేసు నమోదు చేశారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం దివాన్‌చెరువు గ్రామానికి చెందిన కే లక్ష్మి అనే మహిళకు ఈనెల 9న రాత్రి 11:30 గంటల సమయంలో ఇద్దరు వ్యక్తులు ఫోను చేసి బెదిరింపులకు గురిచేయ్యడమే కాకుండా వాట్సాప్ గ్రూప్‌లలో అసభ్యకరంగా వాయిస్ మెసేజ్‌లు పెట్టి అవమానించారని ఈనెల 29న పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో బొమ్మూరు పోలీసులు మునగాలకు చెందిన జీ.సుమంత్, పెద్దాపురానికి చెందిన ఎం.రాజుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దూడలపై కుక్కల దాడి

ఆలమూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం పెదపళ్లలో కుక్కలు గేదె దూడలపై దాడి చేసి తీవ్రంగా గాయపరచాయి. వీటిలో ఒకటి మృత్యువాత పడగా మరో రెండికి వైద్యం అందిస్తున్నారు. ఇలా అయితే పశువుల పెంపకం ఇబ్బందికరంగా మరుతుందని పెంపకందారులు అంటున్నారు. 2 రోజులుగా జరిగిన దాడుల్లో గాయపడిన దూడలకు ఆలమూరు ఏడీ ఎల్.అనిత ఆధ్వర్యంలో వైద్యులు భానుప్రకాష్ వైద్యం అందిస్తున్నారు



పెదపళ్లలో గాయపడిన దూడలను పరిశీలిస్తున్న వైద్యులు

కార్మికుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం

వడ్రంగి కార్పొరేషన్ ఏర్పాటును ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా : మంత్రి సుభాష్



వడ్రంగుల రాష్ట్ర స్థాయి సమావేశంలో ఐక్యత ప్రదర్శిస్తున్న మంత్రి, ప్రతినిధులు

అమలాపురం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కార్మికుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని, వడ్రంగుల సమస్యల పరిష్కారంలో భాగంగా వడ్రంగి కార్పొరేషన్ ఏర్పాటును ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానని కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ హామీ ఇచ్చారు. ఏపీ కార్పెంటర్ అసోసియేషన్ 8వ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ సభ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలోని వాసర్ల గార్డెన్స్‌లో బుధవారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ వడ్రంగి మేస్త్రీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేస్తానని, ఏ కార్మికుడికి కష్టం వచ్చినా తనను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. వడ్రంగి మేస్త్రీల అసోసియేషన్‌కు ఉమ్మడి జిల్లాలో భవనం ఉండేదని, కోనసీమలో కూడా భవనం మంజూరు చేయాలని వడ్రంగి అసోసియేషన్ చేసిన విజ్ఞప్తికి మంత్రి సానుకూలంగా స్పందించారు. కార్మికుల విజ్ఞప్తి మేరకు ప్రత్యేక కార్పొరేషన్ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన ప్రతినిధులు నూతన అధ్యక్షుడు కమిటీ సభ్యులను ఎన్నుకుని మంత్రి సమక్షంలో ప్రమాణ స్వీకారం చేయించారు. రాష్ట్ర కార్పెంటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా తాడికొండ రంగబాబు, ప్రధాన కార్యదర్శిగా నరసింహమూర్తి, ఉపాధ్యక్షుడిగా గానాల సత్యసాయితో పాటు నూతన కార్యవర్గాన్ని మంత్రి అభినందించారు.

గంజాయితో ఐదుగురి అరెస్టు

2.57 కిలోల గంజాయితో పాటు మోటారు సైకిల్, రూ.1500 నగదు స్వాధీనం

సీతానగరం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం నల్గొండ శివారున గంజాయితో ఐదుగురిని అరెస్ట్ చేసినట్టు నార్త్‌జోన్ డీఎస్పీ వై.శ్రీకాంత్ తెలిపారు. బుధవారం సీతానగరం పోలీస్‌స్టేషన్‌లో విలేకర్ల సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు నార్త్‌జోన్ డీఎస్పీ, శ్రీకాంత్ కోరుకొండ సీఐ వై.సత్యకిషోర్ పర్యవేక్షణలో సీతానగరం ఎస్ఐ డి.రామ్‌కుమార్ దాడి చేశారు. నల్గొండ శివారున గంజాయి రవాణా చేస్తున్న అదే గ్రామానికి చెందిన చింతల గంగరాజు, బండారు అప్పన్న దొర, తొర్రేడు గ్రామానికి చెందిన తాటిపాక గణేష్, కడియం మండలం మురమండకు చెందిన నేరుమిల్లి అఖిల్, సీతానగరం మండలం బొబ్బిల్లంకకు చెందిన పోలిన సాయి సతీష్‌ను నల్గొండ శివారు మామిడి తోటల వద్ద అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 2.57 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వీఆర్వో సమక్షంలో ఐదు గంజాయి ప్యాకెట్లు, మోటారు సైకిల్, రూ.1500 నగదు స్వాధీనం చేసుకున్నట్టు, కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించినట్టు పోలీసులు పేర్కొన్నారు. గంజాయిని ఒడిస్సా ఏజెన్సీ ప్రాంతం నుంచి కొనుగోలు చేసి ఇక్కడకు తీసుకొచ్చి చిన్న ప్యాకెట్లుగా చేసి విక్రయాలు చేస్తున్నట్టు వారు తెలిపారు.



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ, సీఐ, ఎస్ఐ

'క్షయ నివారణకు పౌష్టికాహారం తీసుకోవాలి'



పౌష్టికాహారాన్ని అందజేస్తున్న దృశ్యం

కడియం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): దేశంలో క్షయ మరణాల సంఖ్య రోజురోజుకు తగ్గుముఖం పడుతోందని జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డా. వసుంధర తెలిపారు. టీబీ ముక్తి అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం కడియం సీహెచ్‌సీలో టీబీ వ్యాధిగ్రస్థులకు పౌష్టికాహార కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా 100 మంది టీబీ వ్యాధిగ్రస్థులను దత్తత తీసుకుని వారికి వైద్యం, పౌష్టికాహార కిట్లు అందజేస్తున్న సర్వారాయ షుగర్స్ లిమిటెడ్ హెచ్‌ఆర్. శ్రీధర్‌కు అభినందనలు తెలిపారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డా. జీ. మాధురి మాట్లాడుతూ పూర్తికాలం చికిత్స ద్వారా టీబీ వ్యాధిగ్రస్థులు కోలుకొంటారని తెలిపారు. కార్యక్రమంలో టీబీ సూపర్‌వైజర్లు శేషు, మహేష్, సృజనకుమారి, భాగ్యలక్ష్మి, భీమరాజు, శ్రీనివాస్, సతీష్‌బాబు, రవికుమార్, వైద్యసిబ్బంది లావణ్య, అనుప్రసన్న, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

ఇంటి స్థలాల అర్హుల జాబితా పరిశీలన

రాజమహేంద్రవరం రూరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 23 ప్రకారం రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గ పరిధిలో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో భాగంగా క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించినట్టు రాజమహేంద్రవరం ఆర్డీవో కృష్ణనాయక్ తెలిపారు.దీనిలో భాగంగా బొమ్మూరులో ఇంటి స్థలాల కోసం దరఖాస్తు చేసుకున్న అర్హుల జాబితాను ఆయన స్వయంగా పరిశీలించారు. మండల పరిదిలోని వివిధ గ్రామాల వారీగా అర్హుల వివరాలను వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ మండల పరిదిలోని 10 గ్రామాలకు సంబంధించి మొత్తం 2,129 దరఖాస్తులు వచ్చాయన్నారు. రూరల్ తహశీల్దార్ శ్రీనివాసరావు, రెవెన్యూ అధికారి ప్రసాద్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రంగా విగ్రహాలు పెట్టకుండా అడ్డుకుంటున్నారు

● రాధా, రంగా మిత్రమండలి ట్రస్ట్ వ్యవస్థాపకుడు కాళ్లపాలెం బుజ్జి



సమావేశంలో మాట్లాడుతున్న బుజ్జి

రాజమహేంద్రవరం సిటీ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వంగవీటి మోహన రంగా విగ్రహాలు పెట్టకుండా అడ్డుకుంటున్నారని, ఇది దారుణమైన చర్య అని ఆంధ్రా, తెలంగాణ రాధా రంగా మిత్ర మండలి ట్రస్ట్ వ్యవస్థాపకుడు కాళ్లపాలెం బుజ్జి ఆరోపించారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తూర్పుగోదావరి జిల్లాలో ఓ నియోజకవర్గంలో రంగా విగ్రహాలు నాలుగు చోట్ల పెట్టేందుకు ప్రయత్నిస్తే ... అడ్డుకున్నారని ... అనుమతి అడిగితే ప్రజాప్రతినిది దుర్భాషలాడారన్నారు. అలాగే వంగవీటి మోహన్ రంగా పేరు ఒక జిల్లాకు పెట్టాలని గతం నుంచి డిమాండ్ వుందని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడింది కాబట్టి మచిలీపట్నం జిల్లాకు రంగా పేరు పెట్టాలని కోరారు. సమావేశంలో వంగవీటి రాధా రంగా మిత్రమండలి ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో ఆదర్శ ఉద్యోగులకు అభినందన సత్కారం



పురస్కారాలు అందజేస్తున్న మూర్తి

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీలో ఆదర్శ ఉద్యోగులకు అభినందన సత్కార కార్యక్రమం బుధవారం జరిగింది. రాజమహేంద్రవరం డిపోలో అత్యధిక కేఎంపీఎల్ తెచ్చిన ముగ్గురు డ్రైవర్లకు, అత్యధిక ఈపీకే తెచ్చిన నలుగురు కండక్టర్లకు, ఇద్దరు డ్రైవర్లకు, ప్రతిభ కనబరచిన గ్యారేజీ సిబ్బంది ఇద్దరికి నగదు బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా ప్రజారవాణా అధికారి వైఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చడంతోపాటు ఆర్టీసీకి ఆదాయం తెచ్చేలా సిబ్బంది కృషి చేయాలన్నారు. డిపో మేనేజర్ కె.మాధవ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్) ఎం.అజయ్‌బాబు, అసిస్టెంట్ మేనేజర్ (ఎం) ఎస్.నాగలక్ష్మి, సూపరింటెండెంట్ ఎస్ఎస్ఎన్ మూర్తి, ట్రాఫిక్, ఆఫీస్, గ్యారేజీ, సెక్యూరిటీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆదాయ వనరుల పెంపుపై దృష్టి సారించాలి : కలెక్టర్

రాజమహేంద్రవరం సిటీ, జూలై 30(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ ఆదాయ వనరుల పెంపుపై దృష్టి సారించాలని అధికారులకు కలెక్టర్, కార్పొరేషన్ ఇన్‌చార్జి కమిషనర్ పీ. ప్రశాంతి సూచించారు. బుధవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో నగరపాలక సంస్థ వివిధ శాఖాధిపతులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏ నగరంలోనైనా రెవిన్యూ ఆదాయం గతంలో కన్నా మెరుగ్గా ఉందంటే ఆ నగరంలో అభివృద్ధి చెందుతున్నట్లేనన్నారు. గతయేడాది ప్రాపర్టీ ట్యాక్స్ కలెక్షన్ నగరంలో రూ88 కోట్లు కాగా, ఈ ఏడాది కనీసం 10శాతం పెరిగేలా కృషి చేయాలన్నారు. అలాగే ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి హౌస్ టూ హౌస్ సర్వేను వారం రోజుల్లో పూర్తి చేసి డిమాండ్ రైజింగ్ కూడా ప్రారంభించాలన్నారు. సెప్టెంబరు నెలాఖరునాటికి 65శాతం వసూళ్లు జరిగేలా లక్ష్యాన్ని నిర్దేశించుకుని పనిచేయాలన్నారు. అనంతరం నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై సమీక్షించారు.అడిషనల్ కమిషనర్ పివి రామలింగేశ్వర్, ఎస్ఈ ఎంసిహెచ్ కోటేశ్వరరావు, ఎంహెచ్‌వో డాక్టర్ వినూత్న, రెవెన్యూఅధికారులు సిహెచ్ శ్రీనివాసరావు, రవి కుమార్, మేనేజరు ఎండి అబ్దుల్ మాలిక్ ,డిప్యూటీ సిటీ ప్లానర్ శ్రీనివాసరావు ,సిఎంఎం రామలక్ష్మిలు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థలపై ఆంక్షలు అన్యాయం

రాజమహేంద్రవరంసిటీ, జూలై 30(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో నిరాశ్రయులకు, అవసరార్థులకు నిత్యం ఆకలి తీరుస్తూ అన్నదానాలు చేస్తున్న స్వచ్ఛంద సంస్థలపై ఆంక్షలు విధించడం చాలా అన్యాయమని స్వర్ణాంధ్ర స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకుడు డాక్టర్ గుబ్బల రాంబాబు అన్నారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 27 ఏళ్లుగా రాజమహేంద్రవరం కేంద్రంగా స్వచ్ఛందంగా సేవలు అందిస్తున్నామన్నారు. ఎంతోమందిని చేర దీసి ఆదరించి వారిలో మార్పు తీసుకువచ్చి వారి కుటుంబాలకు వారిని చేరువ చేశామన్నారు. ప్రతిరోజూ 550 మందికి అన్నదానం చేస్తున్నామన్నారు. అయితే మూడురోజుల క్రితం స్థానిక పుష్కరాల రేవు వద్ద అన్నదానం చేస్తున్న తమ సంస్థ సిబ్బందిని పోలీసులు అడ్డుకుని స్టేషన్‌కు తరలించారని, ఇది తమకు చాలా బాధ కలిగించిందన్నారు. హెల్పింగ్ హ్యాండ్స్ నిర్వాహకుడు అనూప్ జైన్, స్వర్ణాంధ్ర వాలంటీర్ హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

● కుట్టు శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం సిటీ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా ఎదగాలని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. స్థానిక దబ్బావారి సత్రంలో బీసీ కార్పొరేషన్ సహకారంతో మూడునెలల పాటు కుట్టుమిషన్‌లో శిక్షణ పొందిన 200 మంది మహిళలకు బుధవారం సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. దీనికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ మహిళల కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలుచేస్తోందన్నారు. నగరంలో మహిళల కోసం ఐదు ప్రాంతాల్లో కుట్టుమిషన్ల సెంటర్లు ఏర్పాటు చేసి శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు. నారాయణ పురం, తుమ్మలోవ, దబ్బావారి సత్రం, మునిసిపల్ కాలనీలో సుమారు 628 మంది మహిళలు శిక్షణ పొందుతున్నారన్నారు. భవిష్యత్తులో మరిన్ని కొత్త సెంటర్లు ఏర్పాటుచేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు యిన్నమూరి దీపు, మాటూరి రంగారావు, తవ్వారాజా, నల్లం శ్రీను, శెట్టి జగదీష్, రుంకాని విజయ్, మాలే విజయలక్ష్మి, కర్రి కాశి, ముత్యం సత్తిబాబు, అధిక సంఖ్యలో మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్ఆర్‌యూ అభివృద్ధికి ముందుకు రండి : కలెక్టర్



ఫస్ట్ రిఫరల్ యూనిట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): తుమ్మలోవ ఫస్ట్ రిఫరల్ యూనిట్ అభివృద్ధికి ప్రణాళికతో ముందుకు రావాలని రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్, కలెక్టర్ పీ. ప్రశాంతి ఆదేశించారు.బుధవారం స్థానిక తుమ్మలోవ ప్రభుత్వాసుపత్రిని (ఫస్ట్ రిఫరల్‌యూనిట్) తనిఖీ చేశారు. ఆసుపత్రిలో అందిస్తున్న వైద్యసేవల నాణ్యతపై ఆరా తీశారు. వార్డులు, పరికరాలు, రికార్డులు, మందులనిల్వ, టెస్టుల నిర్వహణ, అవుట్ పేషెంట్ రిజిస్ట్రేషన్ వంటి అంశాలపై ఆసుపత్రి సిబ్బందితో చర్చించారు. అనంతరం ఎఫ్ఆర్‌యూ అభివృద్ధిపై ప్రత్యేకంగా మాట్లాడారు. వైద్య ఆరోగ్య అధికారులు, మునిసిపల్ ఆరోగ్య శాఖ అధికారికి ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. కోవిడ్ అనంతరం ఈ యూనిట్ పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందించకపోతోందన్నారు. దీన్ని దృష్టిలో వుంచుకుని ఈ కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది సేవలను ఇతర అవసరమున్న ప్రాంతాల్లో వినియోగించేందుకు తగిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావు, ఎంహెచ్‌వో డాక్టర్ వినూత్న, జాతీయ గ్రామీణ ఆరోగ్యమిషన్ వైద్యాధికారి డాక్టర్ శ్రీవల్లి, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సరిత ఉన్నారు.

ఆర్ట్స్ కాలేజీ కామర్స్ విద్యార్థుల ఫీల్డ్ విజిట్

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల కామర్స్ విద్యార్థులు బుధవారం ఫీల్డ్ విజిట్ నిర్వహించారు. యూనియన్ బ్యాంకు ఏ విధంగా పని చేస్తుంది, వాటి కార్యకలాపాలు ఎలా జరుగుతాయి, ఏ విధంగా నిర్వహణ ఉంటుంది అనే విషయాలపై ఇది సాగింది. కార్యక్రమంలో భాగంగా యూనియన్ బ్యాంకు మేనేజర్ కిషోర్ మాట్లాడుతూ బ్యాంకింగ్ రంగంలో రాణించాలంటే ఎలాంటి నైపుణ్యాలు పెంచుకోవాలో వివరించారు. యూనియన్ బ్యాంకు కార్యకలాపాలు, బ్యాంకుల ఉత్పత్తులను ఏ విధంగా ఉపయోగించుకోవాలన్న దానిపై మాట్లాడారు. కళాశాల వాణిజ్యశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో బ్యాంకింగ్ ఫైనాన్స్ సర్వీసెస్ అండ్ ఇన్సూరెన్స్ కోరులో భాగంగా కార్యక్రమం చేపట్టడం జరిగిందని ప్రిన్సిపాల్ రామచంద్రరావు తెలిపారు. కామర్స్ విభాగాధిపతి పీవీవీ సత్యనారాయణ, బీఎఫ్ఎస్ఐ కో ఆర్డినేటర్ వి.రమేష్ కృష్ణ, కోర్సు ఫ్యాకల్టీ ఎంవై నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు సరుకుల పంపిణీ

కోరుకొండ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కోరుకొండలో అగ్నిప్రమాద బాధితులకు బుధవారం నిత్యవసర సరుకుల పంపిణీ చేశారు. పసుపులేటి బుల్లి నాయుడు ఆధ్వర్యంలో సప్లై కంపెనీ నరసింహమూర్తి టైలర్ బ్రహ్మంకి తనవంతు సహాయంగా బియ్యం ప్యాకెట్లు, కూరగాయలు, నగదును అందజేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు పాల్గొన్నారు.

కడియపులంక సర్పంచ్ అభ్యర్థి నామినేషన్ దాఖలు



నామినేషన్ పత్రాన్ని అందజేస్తున్న పద్మావతి

కడియం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కడియపులంక సర్పంచ్ ఎన్నిక వచ్చేనెల 10 న జరగనుంది. ఈ నేపథ్యంలో బుధవారం నుంచి ప్రారంభమైన నామినేషన్ల ప్రక్రియలో భాగంగా మాదిశెట్టి పద్మావతి నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ పత్రాన్ని స్టేజీ-1 ఎన్నికల అధికారి మణికుమార్‌కు అందజేశారు. కూటమి నాయకులు మార్గాని సత్యనారాయణ, పాటంశెట్టి వెంకటరామారావు (రాంజీ), వైస్ ఎంపీపీ పంతం గణపతి, తదితరులతో కలిసి నామినేషన్ వేశారు. కడియపులంక ఇన్‌చార్జి కార్యదర్శి, అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ ఏ.శ్రీనివాసరావు, డిప్యూటీ ఎంపీడీవో ఎన్. శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

రూ. నాలుగు లక్షల చెక్కు అందజేత

కడియం, జూలై 30(ఆంధ్రజ్యోతి): కడియపుసావరంలో అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి చెందిన డీ. పెదకాపు కుటుంబానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, రూరల్ కోఆర్డినేటర్ ఆకుల శ్రీధర్ కూటమి నాయకులు చేతుల మీదుగా రూ. నాలుగు లక్షల చెక్కును అందజేశారు. బుధవారం కడియం ఆవలో పర్యటించారు. అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. మురమండలో వల్లూరి పట్టాభి రామయ్యను కలిసి కాసేపు ముచ్చటించి దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ చెక్కపల్లి మురళికృష్ణ, రూరల్ కోఆర్డినేటర్ ఆకుల శ్రీధర్, నీటి సంఘం అధ్యక్షుడు చిక్కాల ఈశ్వరరావు, మాజీ సర్పంచ్ వరగోగుల వెంకటేశ్వరరావు, కొటికలపూడి వెంకటేశ్వరరావు, గారపాటి తాతబ్బాయి, దాసరి ముత్యం, వరగోగుల రుద్రయ్య, తదితరులు ఉన్నారు.

వెంకన్న హుండీ లెక్కింపు

ధవళేశ్వరం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ధవళేశ్వరంలోని శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామివారి ఆలయంలో బుధవారం ఉదయం ఆలయ అధికారి నాగ సురేష్, ఆలయ చైర్మన్ నీలి కోటేశ్వరరావు, సభ్యులు పర్యవేక్షణలో హుండీలు తెరిచి లెక్కింపు చేపట్టారు. ఆరు నెలల కాలానికి గాను హుండీల ద్వారా రూ.2,16,697 ఆదాయం లభించినట్టు ఆలయ అధికారి నాగ సురేష్ తెలిపారు. లెక్కింపు కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాజానగరం, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండలంలో ని 132/130 కేవీ వల్లకడియం ఎస్ఎస్‌లో బే మెయింటె నెన్స్ నిమిత్తం ఆగస్టు 1న ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ ఇన్ చార్జ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జేపీబీ నటరాజన్ బుధవా రం తెలిపారు. దీని ప్రభావంతో 33/11కేవీ రాజానగరం, కానవరం, నందరాడ, మల్లంపూడి విద్యుత్ సబ్‌స్టేష న్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. అగ్రికల్చర్ విద్యుత్ సరఫరా ఉదయం 3గంటల నుంచి సరఫరా చేస్తామన్నారు. ఆదికవి నన్నయ వర్సిటీ నూతన సబ్ స్టేషన్ పనుల్లో బ్రిడ్జ్‌కౌంటీ, గైట్ కళాశాల, నన్నయ వర్సిటీలకు సర్వీసు లకు విద్యుత్‌సరఫరా నిలిచిపోతుంద న్నారు.

194 మందికి వితంతు పింఛన్లు మంజూరు

బిక్కవోలు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో 194మందికి వితంతు పింఛన్లు మంజూరయ్యాయని ఇన్‌చార్జి ఎంపీడీవో వి.నాగేంద్రప్రసాద్ బుధవారం తెలిపారు. ఇటీవల భర్తలు పింఛన్ తీసుకుంటూ చనిపోవడంతోవారి స్థానంలో వారి భార్యలకు ఈపింఛన్లను అందజేస్తామన్నారు. ఆగస్టు1న పింఛన్లను పంపిణీ చేస్తామన్నారు.

ఘనంగా కుమారసుబ్రహ్మణ్యేశ్వరుడికి

శుద్ధ షష్ఠి పూజలు

బిక్కవోలు, జూలై 30(ఆంధ్రజ్యోతి): పళనిలోని సుబ్రహ్మణ్యేశ్వరుడికి నిర్వహించే విధంగా శ్రావణమాసంలో వచ్చే శుద్ధ షష్ఠికి బిక్కవోలులోని శ్రీకుమారసుబ్రహ్మణ్యేశ్వరుడికి ప్రత్యేక పూజలు చేయడం ఎప్పటి నుంచో ఆనవాయితీగా వస్తోంది. బుధవారం షష్ఠి తిధి రావడంతో స్వామి వారికి లక్ష బిల్వార్చన, కావడి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు కొడమంచిలి సత్యనారాయణశర్మ ఆధ్వర్యంలో రుత్వికులు ఈ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకున్నారు.



బిక్కవోలులో శ్రీకుమారసుబ్రహ్మణ్య స్వామికి లక్ష బిల్వార్చన చేస్తున్న అర్చకుడు

ఫలించిన ఎమ్మెల్యే కృషి

● బలభద్రపురంలో బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి స్క్రీనింగ్ టెస్టులు



హైదరాబాద్‌లో ఎమ్మెల్యేను అభినందిస్తున్న బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి యాజమాన్యం

బిక్కవోలు, జూలై 30(ఆంధ్రజ్యోతి): బిక్కవోలు మండలం బలభద్రపురం గ్రామంలో క్యాన్సర్ భూతం వెల్లువికిందన్న ఆందోళన నేపథ్యంలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కృషి ఫలించింది. బుధవారం ఆయన హైదరాబాద్‌లోని దేశంలో పేరొందిన బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్‌ను కలిశా రు. ఢిల్లీలో ఉన్న హాస్పిటల్ చైర్మన్ నందమూరి బాలకృష్ణ, నారా బ్రాహ్మణిలతో ఫోన్‌లో ఆయన మాట్లాడటంతో అందుకు వారు వెంటనే స్పందించి సెప్టెంబర్ మొదటివారంలో బలభద్రపురంలో మెడికల్ క్యాంపు నిర్వహించి అందరికీ క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్టులు నిర్వహించాలని, ఎవరికైనా రోగనిర్ధారణ జరిగితే హాస్పిటల్ తరపున వారికి ట్రీట్‌మెంట్ చేయాలని మేనేజ్‌మెంట్‌కు సూచించారని ఎమ్మెల్యే తెలిపారు. అలాగే ఆడపిల్లలకు వచ్చే గర్భాశయ క్యాన్సర్ నివారించేందుకు వ్యాక్సినేషన్ బాగా ఖరీదుగా ఉందని తెలపడంతో తక్కువ ధరకే సరఫరా చేస్తామన్నారని అయితే తాను నియోజకవర్గానికి సరఫరా చేయాలని కోరానన్నారు.

నాణ్యమైన దిగుబడులు సాధించేందుకే ప్రకృతి వ్యవసాయం

బిక్కవోలు, జూలై 30(ఆంధ్రజ్యోతి): రసాయనిక ఎరువులు తగ్గించి, నాణ్యమైన దిగుబడులు సాధించేందుకే రైతులందరితో ప్రకృతి వ్యవసాయం చేయిచాలని డాట్ సైంటిస్ట్ చల్లా వెంకట నరసింహారావు సూచించారు. బలభద్రపురం ఆర్ఎస్‌కేలో గత మూడురోజులు గా అనపర్తి, బిక్కవోలు, రంగంపేట మండలాల్లోని వీఏఏ, వీహెచ్ఏలకు ప్రకృతి వ్యవసాయంపై ఇస్తున్న శిక్షణ బుధవారం ముగిసింది. ఈసందర్భంగా సైంటిస్ట్ నరసింహారావు మాట్లాడుతూ ప్రభుత్వం ఏటా 12 శాతం చొప్పున రైతులతో ఎరువుల వినియోగం తగ్గించాలన్నదే లక్ష్యమని అన్నారు. ఏటా ప్రభుత్వం రూ లక్షా 70వేల కోట్లు ఎరువులపై రాయితీ ఇస్తుందన్నారు. అనపర్తి ఏడీఏ డీవీ కృష్ణ మాట్లాడుతూ వచ్చే ఆరునెలల్లో సాధ్యమైనంత మందికి ప్రకృతి వ్యవసాయం చేసేలా ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ జిల్లా మేనేజర్ బొర్రా తాతారావు, డాట్ సైంటిస్ట్ మానుకొండ శ్రీనివాస్, ఏడీఏ జయరామలక్ష్మి పాల్గొన్నారు.

పుణ్యక్షేత్రంలో ఆర్డీవో విచారణ

దివాన్‌చెరువు, జూలై30 (ఆంధ్రజ్యోతి): రాజానగరం మండలం పుణ్యక్షేత్రం సచివాలయంలో భూమి విషయమై పీజీఆర్ఎస్‌లో రీ ఓపెన్ అయిన ఫిర్యాదును రాజమహేంద్రవరం ఆర్డీవో కృష్ణనాయక్ బుధవారం పుణ్యక్షేత్రం వచ్చి విచారణ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తనభూమిలో 14 సెంట్లు విస్తీర్ణం తగ్గిందంటూ ఒక రైతు చేసిన ఫిర్యాదుపై తాను విచారణ జరిపామన్నారు. అయితే పిటీషన్‌దారుడి భూమి ఒకవైపు ప్రభుత్వ భూమి ఉందని రెండోవైపు ఒక రైతుకు చెందిన రెండు ఎకరాలు భూమి ఉందన్నారు. ఆ భూమి రికార్డు దాఖలా ఉన్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వెంట రాజానగరం తహసీల్దార్ జీఎస్ఎల్ దేవి ఉన్నారు.

సీఎం చంద్రబాబును కలిసిన అభిరామ్



సింగపూర్‌లో సీఎం చంద్రబాబుతో అభిరామ్

రాజానగరం, జూలై 30 (ఆంధ్రజ్యోతి):సింగపూర్‌లో హైకమిషన్ ఆఫ్ ఇం డియా ఇన్ సింగపూర్‌లో ఏపీ సీఎం చంద్రబాబు సీఎం ప్రోగ్రాం కోఆర్డి నే టర్, మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంక టేశ్ తనయుడు, పెందుర్తి అభిరామ్ మర్యాదపూర్వకంగా కలిశారు.

టీనేజ్ గర్భాల వల్ల అనేక ఆరోగ్య సమస్యలు

సీతానగరం, జూలై 30 (ఆంధ్రజ్యోతి):టీనేజ్ గర్భాలవల్ల అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయని సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా.చైతన్య అన్నారు. బుధవారం స్త్రీశక్తి భవన్‌లో వైద్యఆరోగ్యశాఖ, స్త్రీ శిశు సంక్షేమశాఖల సంయుక్త సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 19 సంవత్సరాల వయస్సు ఉన్న బాలికలకు బాల్య వివాహాలు జరిపించడంవల్ల వారు వెంటనే గర్భం ధరించడం వల్ల అనేక ఆరోగ్య సామాజిక అనర్థాలు సంభవిస్తున్నాయని, ఈ విషయం మీద కిశోర బాలికకు వారి తల్లిదండ్రులకు, ప్రజలకు విస్తృతంగా అవగాహనకల్పించాలన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ

కోరుకొండ, జూలై 30(ఆంధ్రజ్యోతి): కోరుకొండ మం డలంలో వివిధ అనారోగ్య కారణాలతో చికిత్సల అనంత రం సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్న 32 మందికి రాజానగరం నియోజకవర్గం ఎమ్మెల్యే బత్తుల బలరా మకృష్ణ సిఫార్స్ మేరకు మంజూరైన రూ.13లక్షల బుధవారం కోరుకొండ క్యాంపుకార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఆయా గ్రామ నాయకుల సమక్షంలో అందజేశారు. జనసేన పార్టీ జిల్లా జాయింట్ సెక్రటరీ మేడిశెట్టి శివరాం, కోరుకొండ మండల కన్వీనర్ అడ్డాల శ్రీను, కోరుకొండ మండల అధ్యక్షులు బదిరెడ్డి దొర, జనవాణి ఇంచార్జ్ ముక్కా రాంబాబు, తన్నీరు తాతాజీ, తాటి కొండ బుజ్జి, మండపాక శ్రీను, చిక్కిరెడ్డి మునిప్రసాద్ , ప్రగడ జోగారావు, చదువు ముక్తేశ్వరరావు, పంచాది బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్, మూలారెడ్డి విగ్రహావిష్కరణకు ఏర్పాట్లు



దుప్పలపూడిలో ఎన్టీఆర్, మూలారెడ్డి విగ్రహావిష్కరణ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

అనపర్తి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): అనపర్తి మండలం దుప్పలపూడిలో ఏర్పాటుచేసిన టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు నందమూరి తారకరామారావు, మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి మూలారెడ్డిల విగ్రహాల ఆవిష్కరణ ఏర్పా ట్లను ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి బుధవారం పరిశీలించారు. శుక్రవారం మాజీ ఎమ్మెల్యే మూలారెడ్డి తృతీయ వర్ధంతి సందర్భంగా విగ్రహాల ఆవిష్కరణ చేయనున్నట్లు ఆయన తెలిపారు. శుక్రవారం ఉదయం 9గంటలకు దుప్పలపూడిలో ఈవిగ్రహాలను రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత, నీటిపారుదలశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు చేతులమీదుగా ఆవిష్కరించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం రామవరంలోని ఎస్వీఆర్ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మూలారెడ్డి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ప్రముఖ కవి బేతవోలు రామబ్రహ్మం, మానసిక వైద్యుడు డాక్టర్ కర్రి రామారెడ్డిలకు మూ లారెడ్డి స్మారక పురస్కారాలను అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. నియోజకవర్గంలోని కూ టమి నాయకులు, పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

చేయి చేయీ కలుపుదాం..

డెంగ్యూని నివారిద్దాం

● అనపర్తి ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామగురెడ్డి



అనపర్తిలో ర్యాలీ నిర్వహిస్తున్న కమ్యూనిటీ పారామెడికల్, ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు

అనపర్తి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): చేయి చేయి కలుపుదాం డెంగ్యూని నివాదంతో ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని అనప్తత ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ తాడి రామగురెడ్డి పిలుపునిచ్చారు. డెంగ్యూ నివారణ మాసోత్సవాలలో భాగంగా అనపర్తి, బిక్కవోలు మండలాల కమ్యూనిటీ పారా మెడికల్, ప్రైమరీ హెల్త్‌కేర్ ప్రొవైడర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పారా మెడికల్ సిబ్బంది. అసోసియేషన్ ప్రతినిదులు వాసంశెట్టి నాగేశ్వరరావు, డాక్టర్ పద్మశ్రీ, డాక్టర్ తరుణ్, ప్రవీణ, నిర్మలాచారి, నీలంశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

డెంగ్యూ నివారణకు కృషి చేద్దాం

కోరుకొండ: వర్షాకాలంలో ప్రస్తుత వాతావరణ పరిస్థితులు డెంగ్యూవ్యాధి వ్యాప్తికి అనుకూలంగా ఉన్నందున ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకొని డెంగ్యూ నిర్మూలనకు అందరూ సమిష్టిగా కృషిచేయాలని కోరుకొండ పీహెచ్‌సీ వైద్య అధికారి డాక్టర్ జ్ఞానచంద్ర అన్నారు. జాతీయ మాసోత్సవాన్ని పురస్కరిం చుకుని బుధవారం కమ్యూనిటీ పారా మెడికల్స్ అండ్ ప్రైమరీ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తూర్పుగోదావరిజిల్లా కోరుకొండ మండలం ఆధర్యంలో మండల అధ్యక్షుడు కుంచే వినోద్ అధ్యక్ష తన పీహెచ్‌సీ నుంచి డెంగ్యూపై అవగాహన ర్యాలీ నిర్వహిం చారు. ఈ ర్యాలీని డాక్టర్ జ్ఞానచంద్ర ప్రారం భించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బ ళ్ళా శ్రీనివాసరావు, జిల్లాకార్యదర్శి పి దేవానం దం, జిల్లా కోశాధికారి, పి.చిన్ని, మండల కార్య దర్శి ఎస్.భాస్కర్, కోశాధికారి బీహెచ్ శివ కుమార్, చల్లా గంగాధర్, వి.సత్యానందం, అమరశెట్టి ప్రసాద్,కర్రి వంశి,పట్నాయకుని శ్రీనివాస్, ఎం.మల్లేష్, జోగారావు, శేషగిరి, వెంకటేశ్వరరావు, బి.స్వాస్, సభ్యులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ దేశవ్యాప్త రాజకీయ కుట్ర

● మాలమహానాడు నాయకుడు రత్నాకర్



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఎస్ రత్నాకర్

అనపర్తి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ మాలలను అణచివేసేందుకు దేశవ్యాప్తంగా రాజకీయ పార్టీలు కుట్రలు పన్నుతున్నాయని ఈ చట్టాలను వెనుకకు తీసుకునే వరకు తమ పోరాటం నిరంతరం కొనసాగుతుందని నేషనల్ ప్రెసిడెంట్ ఫర్ రాక్స్ అండ్ మాల మహానాడు నాయకుడు డాక్టర్ ఆర్ ఎస్ రత్నాకర్ హెచ్చరించారు. బుధవారం అనపర్తిలో ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏపీ, తెలంగాణాల్లో చేసి నా మాలలను అణగదొక్కే ప్రయత్నం చేసినప్పటికీ రెండు రాష్ట్రాలలో మాల ప్రజాప్రతినిధులకు పట్టకపోవడం ఆశ్చర్యంగా ఉందన్నారు. చట్టాలు చేసినప్పటికీ పని పూర్తవ్వలేదని వీటిని వెనుకకు తీసుకునే వరకు పోరాటం చేయాలని దీనికి మాలలంతా ముందు రావాలన్నారు. సుప్రీంకోర్టు జనాభా ప్రాతిపదికన వర్గీకరణ చేయమని తీర్పునిస్తే కులాలకు సంబంధించిన లెక్కలులేకుండా నాయకులు ఎలా వర్గీకరణ చేశారని ఆయన ప్రశ్నించారు. కొప్పుల ప్రేమ్‌బాబు, బల్లసత్యనారాయణ, నెల్లి సూరిబాబు, మద్ద మదుసూదన్‌రావు పాల్గొన్నారు.

'కూటమి సఖ్యతపై మాజీ ఎమ్మెల్యేకు చింత ఎందుకో'

అనపర్తి, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : అనపర్తి నియోజకవర్గంలో కూటమి పార్టీలపై సఖ్యతపై మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డికి చింత ఎందుకో అర్థం కావడంలేదని రాష్ట్రంలోనే అనపర్తి కూటమి సఖ్యతతో ముందుకు సాగుతుందని అనపర్తి మండల బీజేపీ అ ధ్యక్షుడు కర్రి బులిరెడ్డి అన్నారు. బుధవారం అనపర్తిలోని విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల మాజీ ఎమ్మెల్యే కూటమి పార్టీలలో సఖ్యతపై చేసిన వ్యాఖ్యలు అర్ధరహితమన్నారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లిడి సురేంద్రరెడ్డి, బిక్కవోలు మండల పరిషత్ అధ్యక్షురాలు సుమ పాల్గొన్నారు,

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
గురువారం 31 జూలై 2025 | 5





పోస్టర్ ఆవిష్కరిస్తున్న జిల్లా జడ్జి గంధం సునీత, తదితరులు

అక్రమ కార్యకలాపాలపై కఠిన చర్యలు

జిల్లా జడ్జి గంధం సునీత

రాజమహేంద్రవరం సిటీ, జూలై 30(ఆంధ్రజ్యోతి): అక్రమ కార్యకలాపాలపై చట్టపరంగా కఠిన చర్యలను లీగల్ సర్వీసెస్ అథారిటీ తీసుకుంటుందని జిల్లా జడ్జి గంధం సునీత అన్నారు. ప్రపంచ మానవ అక్రమ రవాణా దినంను పురస్కరించుకుని జిల్లా కోర్టు ఆవరణలో బుధవారం చైల్డ్‌వెల్ఫేర్, విద్య, పోలీస్ తదితర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు.మానవ అక్రమ రవాణా దినం పోస్టర్ ఆవిష్కరించారు.2015 నుంచి మానవ అక్రమ రవాణా, బాల కార్మికులు, బాల్య వివాహాలు, లైంగిక వేధింపులు, కిడ్నాప్ తదితర చట్టవ్యతిరేక చర్యలపై చర్యలు తీసుకుంటున్నామన్నారు.



నౌకాశ్రయం!

కాకినాడలో హిందుస్థాన్ షిప్‌యార్డ్ నిర్మాణ యోచన

- అనువైన ప్రాంతానికి అన్వేషణ
- 110 ఎకరాలకు ప్రతిపాదన
- బుధవారం ప్రతినిధుల పర్యటన
- డీప్‌వాటర్‌పోర్టులో పరిశీలన
- రూ.900 కోట్లతో కేంద్రం
- అన్నీ కుదిరితే పెద్ద ప్రాజెక్టు
- మారిటైంబోర్డు సానుకూలత
- మూలపేటపైనా కసరత్తు

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

కాకినాడలో నౌకా నిర్మాణ కేంద్రం ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయి. కేంద్ర ప్రభుత్వానికి చెందిన హిందుస్థాన్ షిప్ యార్డు లిమిటెడ్ (హెచ్ఎస్ఎల్) ఇక్కడ శాటిలైట్ షిప్ యార్డు నిర్మాణానికి మొగ్గు చూపుతోంది. ఈ మేరకు హెచ్ఎస్ఎల్ అధికారికంగా ధ్రువీకరించింది.ఈ నేపథ్యంలో కాకినాడలో అనువైన భూముల లభ్యత ఎక్కడ ఉందనేది పరిశీలిస్తోంది. ఇప్పటికే ఇక్కడ ఓ సంస్థ ఎప్పటి నుంచో నౌకలు తయారు చేస్తుండడం,ఇక్కడున్న సానుకూల వాతావరణంతో కాకినాడే ఖాయమయ్యే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

కాకినాడ అనువైన ప్రాంతం

నౌకల నిర్మాణం చేపట్టడానికి సముద్రపు అలల తాకిడి తక్కువగా ఉన్న ప్రాంతం చాలా కీలకం.ఇది కాకినాడలో ఉంది. పైగా ఒకప్పుడు బ్రిటిష్ యుగంలో కోరంగి వద్ద నౌకల తయారీ, మరమ్మతులు జరిగేవి. అప్పుడే ఈ రంగంలో కాకినాడ పేరొందింది. కానీ ఆ తర్వాత పెద్దగా ఈ రంగం కాకినాడలో విస్తరించలేదు. నౌకల తయారీకి సముద్రానికి ఆనుకుని విశాలమైన భూములు అవసరం. వీటిలో నౌకలు, బార్జీలు, టగ్‌లు తయారు చేసి ఆ పక్కనే ఉన్న సముద్ర జలాల్లోకి వీటిని దించి పరీక్షలు చేసి సరుకు రవాణాకు వినియోగిస్తారు.ఈ అనుకూల వాతావరణం కాకినాడలోనే ఉంది. సీఫ్రంట్‌గా పిలిచే ఈ సౌకర్యం కాకినాడ జగన్నాథపురం బ్రిడ్జి నుంచి యాంకరేజ్ పోర్టు వరకు రెండు కిలోమీటర్ల వరకు విస్తరించి ఉంది. ఇన్ని సానుకూలతలు కాకినాడకు ఉన్నాయి.

గతంలో చాలా కంపెనీలు..

గతంలో కాకినాడలో షిప్‌యార్డు నిర్మించడానికి సింగపూర్ కంపెనీ ముందుకు వచ్చింది. కాకినాడ సీపోర్టులో కొంతకాలం కార్యకలాపాలు నిర్వ హించింది. వివిధ దశల్లో రూ.1,725 కోట్ల పెట్టుబడులకు సిద్ధమైంది. ప్రోత్సాహం కరువై ఇక్కడ యార్డును మూసేసింది. ఎల్అండ్‌టీ కంపెనీ 2006లో కాకినాడలో షిప్‌యార్డు నిర్మాణానికి ముందుకొచ్చింది. రూ.2 వేల కోట్ల పెట్టుబడితో నౌకా నిర్మాణ కేంద్రం ఏర్పాటుకు రంగం సిద్ధం చేసుకుంది. కానీ అప్పటి ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం లేక చెన్నైకు వెళ్లిపోయింది. 2020లో రూ.7 కోట్ల కాకినాడ స్మార్ట్‌సిటీ నిధులతో జగన్నాథపురం సమీపంలో అధికారులు బోట్ బిల్డింగ్ యార్డు నిర్మించారు.ఇందులో ఒకేసారి 18 వరకు భారీ బోట్లు తయారుచేసే వసతులు సిద్ధం చేశారు. కానీ తగిన ప్రోత్సాహం లేక అదీ ఈసురోమంటోంది. కొచ్చిన్, గోవా, మజ్‌గావ్‌లో హిందుస్థాన్ షిప్‌యార్డులు 100 నుంచి 150 ఎకరాల విస్తీర్ణంలో నౌకలను నిర్మిస్తున్నాయి.ప్రస్తుతం కాకినాడలో శాన్‌మెరైన్ అనే సంస్థ ఎన్నో ఏళ్లుగా చిన్న, మధ్య తరహా నౌకలు, బార్జీలు, టగ్‌లు నిర్మిస్తోంది. గతేడాది 8వేల టన్నుల భారీ నౌకను నిర్మించింది. వచ్చే ఐదేళ్లలో మరో 25 వరకు నిర్మించి దేశ వ్యాప్తంగా పలు కంపెనీలకు అందివ్వడానికి సిద్ధమవుతోంది. ఈ సంస్థ హిందుస్థాన్ షిప్ యార్డుతోను పలు ఒప్పందాలు చేసుకుంది.

ఓకే అంటే రూ.900 కోట్లు

బుధవారం డీప్‌వాటర్‌పోర్టు ఏరియాలోని రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన భూములను హిందుస్థాన్ షిప్‌యార్డు ప్రతినిధులు పరిశీ లించారు.భూముల లభ్యత.. సముద్రానికి ఎంత దూరం వంటివన్నీ పరిశీలించారు. ఇక్క డే ఉన్న మారీటైం బోర్డు అధికారులతోను సమావేశమయ్యారు.ఈ నేపథ్యంలో త్వరలో నిర్ణయం తీసుకోనున్నారు. ఒకవేళ కాకినాడలో భూములు ఓకే అయితే రూ.900 కోట్ల వరకు హిందుస్థాన్ షిప్‌యార్డు ఇక్కడ పెట్టుబడులు పెట్టనుంది. ప్రస్తుతం రక్షణశాఖకు అవసరమైన అన్నిరకాల యుద్ధ,ఇతర నౌకలను హెచ్ ఎస్ఎల్ నిర్మిస్తోంది. భారత నావికాదళంతో రూ.19 వేల కోట్ల విలువైన భవిష్యత్తు ఆర్డర్లు ఈ సంస్థకు ఉన్నాయి.ప్రస్తుతం విశాఖలో ఉన్న షిప్‌యార్డుకు బ్రాంచ్ యార్డుగా కొత్తది నిర్మించనున్నారు. తద్వారా నౌకల నిర్మాణం మరింత వేగవంతం చేయాలని ఈ సంస్థ ఆలోచన. కాకినాడతో పాటు శ్రీకాకుళం జిల్లా మూలపేట తీరప్రాం తాన్ని హెచ్ఎస్ఎల్ పరిశీలించి తుది నిర్ణయం తీసుకోనుంది.దాదాపుగా కాకినాడవైపే హెచ్ ఎస్ఎల్ ఎక్కువ ఆసక్తి చూపుతోందని అధికారులు చెబుతున్నారు. ఇక్కడ సానుకూలతతో పాటు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన ఏపీ మారిటైం పాలసీకి కాకినాడ కేంద్రంగా ఉన్న రాష్ట్ర మారిటైం బోర్డు కార్యాలయం నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తుండడంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని ఇక్కడే భూముల కేటాయింపు జరిగేలా పర్యవేక్షిస్తోంది.



సీఎంను కలిశారు..

రాష్ట్రంలో భారీ నౌకల నిర్మాణం విశాఖలో కేంద్ర ప్రభుత్వానికి చెందిన హిందుస్థాన్ షిప్ యార్డు చేపడుతోంది.ఇది మినహా షిప్‌యార్డు మరెక్కడా భారీగా లేదు. త్వరలో మరో షిప్ యార్డు నిర్మించడానికి కాకినాడ అనువైనదిగా భావిస్తోంది.110 నుంచి 150 ఎకరాల భూములు ఉన్న చోట షిప్‌యార్డు నిర్మాణం చేపడతామని హెచ్ఎస్ఎల్ సీఎండీ ఖత్రీ ప్రకటించారు.ఇప్పటికే సీఎం చంద్రబాబును కలిసి తమ ప్రతిపాదన వివ రించారు.షిప్‌యార్డుకు కాకినాడే అనువైనదిగా ఆ సంస్థ భావిస్తోంది.

రెండు రోజుల్లో.. సుఖీభవ



మరో హామీకి సర్కారు గ్రీన్‌సిగ్నల్

- 2న రైతుల ఖాతాలకు సొమ్ములు
- అన్నదాత సుఖీభవ రూ.5 వేలు
- పీఎం కిసాన్ రూ.2 వేలు
- ఒక్కో ఖాతాలో రూ.7 వేలు జమ
- పీఎం కిసాన్ లబ్ధిదారులే ఎక్కువ
- కౌలు రైతులకు రూ.20 వేలు
- వచ్చే విడత నుంచి అమలు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

అన్నదాతలకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు శుభవార్త చెప్పాయి. రైతులను ప్రోత్సహించడానికి రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ, కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ పథకం కింద సహాయం చేయనున్నాయి.గత వైసీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు రైతులకు ఏడాదికి కేవలం రూ. 13,500 మాత్రమే రైతు భరోసా కింద ఇచ్చేవారు. అందులో రాష్ట్రం వాటా రూ.7500, కేంద్రం వాటా రూ.6 వేలు ఉండాది. ఎన్నికల హామీలో భాగంగా తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఏకంగా 6,500 పెంచి మొత్తం రూ.20 వేలు వేస్తోంది. రాష్ట్రం వాటా రూ.14 వేలు, కేంద్రం వాటా రూ.6 వేలు. కానీ అప్పటి మాదిరిగానే మూడు విడతలుగా సొమ్ము రైతుల బ్యాంక్ ఖాతాలకు జమకానుంది. ఏప్రిల్ నుంచి జూలై వరకూ మొదటి విడత , ఆగస్టు నుంచి నవంబరు వరకూ రెండో విడత, డిసెంబర్ నుంచి మార్చి వరకూ మూడో విడతగా విభజించారు. అన్నదాత సుఖీభవ కింద రాష్ట్ర ప్రభుత్వం మొదటి విడత రూ.5 వేలు, రెండో విడత రూ.5 వేలు, మూడో విడత రూ.4 వేలు జమ చేస్తుంది. పీఎం కిసాన్ పథకం కింద ఒక్కో విడతకు రూ.2వేలు వంతున మూడు విడతల్లో ఆరువేలు సరిపెడుతుంది. ఆగస్టు 2న జిల్లాలో ఒక్కో రైతుకు రూ.7 వేల వంతున జమకానుంది.ఈ సారి ప్రభుత్వం కౌలు రైతులకు ఈ పథకాన్ని వర్తింపజేస్తుంది. ఒక్కో రైతుకు రూ.20 వేల వంతున ఇస్తుంది. ఈ విడతలో ఇంకా అర్హులైన కౌలు రైతుల లెక్కతేలక వచ్చే విడత నుంచి జమచేస్తారు..

ఎవరు అనర్హులంటే..

రాజ్యాంగం ప్రకారం జరిగిన ఎన్నికల్లో ఎన్నికైన ప్రజాప్రతినిధులందరూ ఈ పథకం కింద లబ్ధి పొందడానికి అనర్హులు.ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఎంపీపీ, జడ్పీ చైర్మన్, సర్పంచ్, వార్డు సభ్యులు కూడా అనర్హులే.కౌన్సిలర్లు, మునిసిపల్ చైర్మన్లు అనర్హులే. ఆదాయ పన్ను చెల్లింపుదారులు, ప్రభుత్వ ఉద్యోగులు అనర్హులు. వెబ్‌ల్యాండ్‌లో లేని రైతులకు ఈ పథకం వర్తించవదు. పీఎం కిసాన్ పథకం కింద గతంలో లబ్ధిపొందినా రైతు చనిపోతే వారి కుటుంబీలకు కూడా ఇవి వర్తించవు. జిల్లాలో ఈకేవైసీ కింద 13 మంది పెండింగ్ ఉన్నారు. విదేశాలు, ఇతర రాష్ట్రాల్లో కొందరు ఉండగా బయోమెట్రిక్‌లో వేలిముద్రలు పడకపోవడం వల్ల కొందరికి సమస్యగా ఉంది.కనీసం పది సెంట్ల భూమి ఉన్నా ఈ పథకం కింద అర్హులవుతారు.

జిల్లాకు రూ. 54 కోట్లు

ఆగస్టు 2న జిల్లా రైతాంగానికి అన్నదాత సుఖీభవ కింద సుమారు రూ.54 కోట్లు జమ కానుంది. జిల్లాలో మొత్తం 1,16,544 మంది రైతులు ఉండగా వారిలో ఈకేవైసీ పూర్తయిన వారు 1,13,539 మంది ఉన్నారు.2,992 మందిని వివిధ కారణాలతో రిజక్ట్ చేశారు. 13 పెండింగ్ ఉన్నాయి. ఈ రెండు రోజుల్లో వారు ఆధారాలు చూపి సరిచేసుకుంటే డబ్బులు పడతాయి.ఆధార్ నంబర్ సరిగ్గా లేకపోవడం, బ్యాంక్ ఖాతాలు పనిచేయకపోవడం వంటి కారణాలు ఉన్నాయి.



పీఎం కిసాన్ రూ. 24 కోట్లు

పీఎం కిసాన్ కింద జిల్లాలో ఒక లక్షా 20 వేల మంది రైతులకు రూ.2 వేల వంతున రూ.24కోట్లు జమకా నుంది. జిల్లాలో అన్నదాత సుఖీభవ కంటే పీ ఎం కిసాన్ రైతులు ఎక్కువ మంది ఉన్నారు. దీనికి కారణం 2019 ఫిబ్రవరి 1వతేదీ లోపు భూమి రికార్డుల డేటా ఆధారంగా పీఎం కిసాన్ అమలవుతోంది. అప్పటి నుంచి డేటా మారలేదు. చనిపోయిన వారుంటే తీసేస్తున్నారు. కానీ అమ్మకాలు, కొనుగోళ్లు చేసిన రైతులకు మాత్రం ఈ పథకం వర్తిస్తుంది.



డ్రగ్స్‌పై అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎస్పీ నరసింహ కిశోర్

డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

ఎస్పీ నరసింహ కిశోర్

రాజమహేంద్రవరం కల్చరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): యాంటిబయోటిక్స్, నార్కోటిక్స్ డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలని జిల్లా ఎస్పీ నరసింహ కిశోర్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పిలుపు మేరకు ఈగల్ టీం, ది రాజమండ్రి కెమిస్ట్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం రాజమహేంద్రవరంలో నిర్వహించిన భారీ అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. డ్రగ్స్‌కు అలవాటు పడిన వారికి నగరంలో ఇప్పటికే రెండు యాంటీ డ్రగ్స్ ఎడిక్ట్ కేంద్రాల ద్వారా కౌన్సెలింగ్ ఇప్పి స్తున్నామని తెలిపారు. మెడికల్ షాపుల్లో ఎక్కువ మోతాదులో డ్రగ్స్‌ను కొనుగోలు చేస్తు న్న వారి వివరాలు పోలీసులకు తెలియజేయాలన్నారు. గంజాయి వినియోగదారులపై తగిన చర్యలు తీసుకుంటామన్నారు. గంజా యి విక్రయించే వారిపై పీడీ యాక్టు నమోదు చేస్తామని హెచ్చరించారు.డ్రగ్స్ కంట్రోల్ అసిస్టెంట్ డైరెక్టర్ పి.నాగమణి మాట్లాడుతూ, వైద్యుల చీటీ లేకుండా కొన్ని మందులు విక్రయించకూడదన్నారు. అనంతరం జాంపేట పోలీస్ కన్వెన్షన్ హాలులో అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్య క్షుడు పిల్లా బాబు, తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు రాయపూడి శ్రీనివాసరావు, హోల్‌సేల్ అధ్యక్షుడు మహేంద్రనాథ్, సెక్రటరీలు ఫణీంద్ర, కృష్ణబాలాజీ, పెండెం రామూజీ, సంపత్‌కుమార్, లాలాధర్, డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ హరిహర తేజ,ఏఎస్పీ మురళీకృష్ణ(అడ్మినిస్ట్రేషన్),మెడికల్ షాపు యజమానులు తదితరులు పాల్గొన్నారు.



సమస్యల్లేకుండా చూడండి

సమగ్ర శిక్ష అడిషనల్ కోఆర్డినేటర్

రాజానగరం, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : ఉదయం నుంచి విద్యుత్ సరఫరా లేకపోవడం,జనరేటర్ అందుబాటులో లేకపోవడం వల్ల ఉపాధ్యాయులు ఇబ్బంది ఎదుర్కొన్నారని తూర్పుగోదావరి జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ కోఆర్డినేటర్ ఎస్.సుభాషిణి అన్నారు. రాజానగరం మండలంలో మల్లంపూడిలోని శ్రీసాయి మాధవి ఇంజనీరింగ్ కళాశాలలో కస్తూర్బా గాంధీ విద్యాలయం కాంట్రాక్టు ఉపాధ్యాయులకు జరుగుతున్న శిక్షణ తరగతులను బుధవారం సందర్శించారు. శిక్షణా కేంద్రంలో అరకొర వసతులు, అసౌకర్యాలపై పత్రికల్లో వచ్చిన కథనాలపై ఆమె స్పందించి కళాశాలలో నెలకొన్న ఇబ్బందులను పరిశీలించారు. వాటర్ ట్యాంకులతో కూడిన నీటి సదుపాయంతో పాటుగా జనరేటర్ ఏర్పాటు చేశామన్నారు. శిక్షణ కేంద్రంలో ఉపాధ్యాయులకు ఏర్పాటు చేసిన భోజనాన్ని వారితో కలిసి భుజించి సంతృప్తి వ్యక్తం చేశారన్నారు. బాత్‌రూమ్‌లకు తలుపులు లేవని చెప్పడం అవాస్తమన్నారు. ఇటువంటి పరిస్థితులు పునావృతం కాకుండా చూడాలని నిర్వాహకులను ఆదేశించారు.

వైసీపీ కమిటీల ఏర్పాటు

రాజమహేంద్రవరం, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ఎట్టకేలకు సంస్థాగత నియామకాలపై దృష్టి పెట్టింది. గ్రేటర్ రాజమహేంద్రవరం కమిటీని నియమించింది. మాజీ ఎంపీ మార్గాని భరత్ సిటీ ప్రెసిండెంట్‌గా ఉన్న సంగతి తెలిసిందే. కొత్తగా 38 మందిని నియమిస్తూ కేంద్ర కమిటీ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. చోడిశెట్టి సత్యవేణి రాఘవబాబు, గుత్తుల మురళీధర్, దుంపా చంద్రరెడ్డి వైస్‌ప్రెసిండెంట్లుగా, దుర్వాసుల సత్యనారాయణ మూర్తి, నాగేశ్వరరావు, కానుబోయిన సాగర్, మహ్మద్ షబీర్, నందం స్వామి, జువ్వల నాగేశ్వరరావు, కారపురెడ్డి బాబ్జి రెడ్డిని ప్రధాన కార్యదర్శులుగా నియమించారు. మరో 13 మందిని సెక్రటరీలుగా, మరో 15 మందిని ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా నియమించారు. ఇక జిల్లా వైస్ ప్రెసిడెంట్‌గా కడియాల శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా దాసి వెంకట్రావు, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా ముప్పన శ్రీనివాస్, లక్కోజు ఓంకార్, సెక్రటరీలుగా తమ్మిశెట్టి శివ ప్రసాద్, దామదాసు శ్యామ్ సుధీర్, జిల్లా అధికార ప్రతినిధిగా రొక్కం త్రినాథ్ నియమితులయ్యారు.

5 మండలాల్లో.. 150 మందే కట్టారా!

అధికారులపై కలెక్టర్ సీరియస్

రాజమహేంద్రవరం,జూలై 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో అందరికీ గృహం కార్యక్రమం పనుల్లో పురోగతి ఉండాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో బుధవారం ఐదుగురు మండల స్థాయి అధికారులతో సమీక్షించారు. సీతానగరం, నల్లజర్ల, దేవరపల్లి, రాజానగరం, కడియం మండలాల పరిధిలో అదనపు ఆర్థిక సహాయం 704 మందికి చేస్తే కేవలం 150 మంది మాత్రమే ఇళ్లు నిర్మించుకున్నారన్నారు. ఈ మండలాల పరిస్థితి మొత్తం జిల్లా పనితీరుపై ప్రభావం చూపుతుందన్నారు. సకాలంలో భవన నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. సమీక్షలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, హౌసింగ్ పీడీ ఎస్.భాస్కరరెడ్డి, ఎంపీడీవో,హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.

24 గంటలూ వైద్యం అందాలి

- ఆంధ్రజ్యోతి కథనంతో కదలిక
- సమిశ్రగూడెంలో మంత్రి తనిఖీ



సమిశ్రగూడెం ఆసుపత్రిని పరిశీలించి వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్

నిడదవోలు, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఆంధ్రజ్యోతి దినపత్రికలో బుధవారం "పగలు వైద్యం.. రాత్రికి తాళం" శీర్షికన నిడదవోలు మండలం సమిశ్రగూడెం గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంపై ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. ఆసుపత్రిని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకు అత్యవసర వైద్య సేవలు ఏ మేరకు అందుతున్నాయన్న అంశంపై ఆరా తీశారు.రాత్రి వేళలో ఆసుపత్రి తలుపులు ఎందుకు మూసివేస్తున్నారని ప్రశ్నించారు. రాత్రి వేళల్లో కూడా అత్యవసర సేవలందించాలని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించబోమని హెచ్చరించారు.ఇక నుంచి ఈ తరహా తనిఖీలు నిరంతరం కొనసాగుతాయన్నారు.అనంతరం సమిశ్రగూడెంలోని మండల పరిషత్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. నిడదవోలు నియోజకవర్గంలో 192 మంది మార్గదర్శకులు ముందుకు వచ్చారని.. ఒక్క నిడదవోలు మండలంలోనే 2,137 బంగారు కుటుంబాలను గుర్తించామని తెలిపారు. త్వరలోనే మరింత మంది మార్గదర్శకులు, బంగారు కుటుంబాలను గుర్తించి ఆగస్టు 8వ తేదిన పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు. పేదరిక నిర్మూలనకు ఎవరైనా ముందుకు వచ్చి బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవచ్చన్నారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సంధ్య, వైద్యాధికారులు, వైద్య సిబ్బంది ఉన్నారు.



పోస్ట్‌మార్టంపై ఎందుకింత నిర్లక్ష్యం

సూపరింటెండెంట్ ఆఫీస్ ఎదుట ధర్నా

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రి (జీజీహెచ్)లో మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించే ప్రక్రియలో తీవ్ర ఆలస్యం చోటు చేసుకోవడాన్ని నిరసిస్తూ సీతానగరం మండలానికి చెందిన పలువురు మంగళవారం సాయంత్రం జీజీహెచ్ సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు.ఈ సంఘటన ఆసుపత్రి వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. వీలైనంత త్వరగా పోస్టుమార్టం పూర్తిచేసి మృతదేహాలను అప్పగించాల్సి ఉండగా.. ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యం వల్ల రోజుల సమయం పడుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు.దీనిపై సూపరింటెండెంట్ తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అయితే సూపరింటెండెంట్ తన ఛాంబర్‌లో లేరు.సమాచారం తెలుసుకున్న ఆసుపత్రి అధికారులు మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తి చేసి బాధిత కుటుంబీకులకు అప్పగించారు.

కొలిక్కిరాని పేపరుమిల్లు కార్మికుల చర్చలు

రాజమహేంద్రవరం,జూలై 30 (ఆంధ్ర జ్యోతి) : చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న పేపరుమిల్లు కార్మికుల జీతాల సమస్య పరిష్కారమైంది. ఇటీవల పర్మినెంట్ ఉద్యో గులకు రూ.5800 పెంచడానికి అంగీకరించగా.. బుధవారం తాత్కాలిక ఉద్యోగుల జీతాలు, బకాయిల విషయంలో కూడా ఒప్పందం కుదిరింది. ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ విజయానంద్ సూచనల మేరకు మూడు రోజులు పాటు పేపరుమిల్లు యాజమాన్యం, కార్మిక సంఘాల ప్రతినిధుల మధ్య జరిగిన చర్చలు సఫలమయ్యాయని విజయవాడ లేబర్ కమిషనర్ శేషగిరిబాబు తెలిపారు.అయితే స్థానిక సంఘాలు మాత్రం వ్యతిరేకి స్తున్నాయి. ఏరియర్స్ 50 రోజులకే ఇవ్వడానికే అంగీకరించారు. తాత్కాలిక ఉద్యోగులకు 50 శాతం జీతం పెంచాలని డిమాండ్ చేయగా యాజమాన్యం సుమారు 20 శాతం పెంచడానికి ముందుకొచ్చింది.ఈనేపథ్యంలో గురువారం కలెక్టర్‌ను కలుస్తామని యూని యన్ నాయకుడు సీపీఎం నేత అరుణ్ తెలిపారు.



ఉరకలై..గోదావరి

కొవ్వూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు వరద నీరు అధికంగా వచ్చి నదిలో చేరడంతో గత 15 రోజులుగా గోదావరి ఉధృతంగా ప్రవహిస్తుంది. వరద తగ్గుతూ, పెరుగుతూ దోబూచులాడుతుంది. కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో గత 4 రోజలుగా ప్రధాన స్నానఘట్టాలు ఇంకా నీట మునిగే ఉన్నాయి. బుధవారం వరద కొంచెం తగ్గుముఖం పట్టినప్పటికీ నదీ ప్రవాహం ఉధృతంగా కొనసాగుతోంది. వరద గోదావరిని చూడడానికి పట్టణ పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు అధికసంఖ్యలో గోష్పాదక్షేత్రానికి చేరుకుంటున్నారు.గోదావరి ఉధృతంగా ప్రవహిస్తుండడంతో నదిలో ఎవ్వరూ దిగవద్దని పోలీసులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

అనధికార స్థలాల క్రమబద్ధీకరణకు
దరఖాస్తు చేసుకోవాలి : కమిషనర్

కొవ్వూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని ప్రజలకు సులభతరంగా స్వీయ ధ్రువీకరణ అంగీకారపత్రం సమర్పించి భవన నిర్మాణ అనుమతులు పొందుటకు వెసులు బాటు కల్పించినట్టు మున్సిపల్ కమిషనర్ జీ.సందీప్ తెలిపారు. పురపాలక సంఘం పరిధిలోని అనధికార లే అవుట్లలో స్థలాలు కొనుగోలు చేసిన వాటికి 2025 జూలై 26 నాటికి 90 రోజులు మున్సిపల్ కార్యాలయంలో ఆన్‌లైన్ ఎల్ఆర్ఎస్ వెబ్సైట్ నందు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దీనిలో భాగంగా మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ జీవోఎంఎస్ నెంబరు 134, 2025 జూలై 26 ద్వారా అనధికార లే అవుట్‌లు, ప్లాట్లు క్రమబద్ధీకరణ రూల్స్ 2020ను సవరణ చేస్తూ ఆర్డర్ జారీ చేయడం జరిగిందన్నారు. మున్సిపాల్టీలో 2025 జూన్ 30 నాటికి ముందు ఎవరైనా అనధికార లే అవుట్‌లలో ప్లాట్లు, అనధికార స్థలాలు కొనుగోలు చేసినవారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆ దరఖాస్తులను ఎల్ఆర్ఎస్ జీవో ప్రకారం పరిశీలించి, ఫీనలైజేషన్ చార్జీలు, స్థలముకు 14 శాతం మార్కెట్ వాల్యూ (ప్రస్తుతం 2025 జూన్ 30) ప్రకారం చార్జీలు చెల్లించిన స్థలములను డిస్‌ప్యూట్ ఫ్రీ స్థలాలు, లీగల్‌గా కరెక్టు డాక్యుమెంటేషన్ (సరైన దస్తావేజులు) ఉన్న స్థలాలను క్రమబద్ధీకరించడం జరుగుతుందన్నారు.

ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఇంటింటా చెత్తసేకరణ
విధిగా చేపట్టాలి : ఎంపీడీవో


సత్యవాడలో చెత్తసేకరణను పరిశీలిస్తున్న దృశ్యం

ఉండ్రాజవరం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఇంటింటా చెత్తసేకరణ విధిగా చేపట్టాలని ఎంపీడీవో వీఎస్ రామారావు చెప్పారు. బుధవారం ఉదయం సత్యవాడలో జరుగుతున్న పారిశుధ్య కార్యక్రమాలను ఆయన తనిఖీ చేసి మాట్లాడుతూ ప్రతి ఇంటి నుంచి తడి, పొడిచెత్త తప్పనిసరిగా సేకరించాలన్నారు. అలాగే ప్రతిరోజూ విధిగా పారిశుధ్య సిబ్బంది చెత్తను సేకరించాలన్నారు. పారిశుధ్య పనులు, రోడ్లపక్కన పెరిగిన పిచ్చి మొక్కలు నివారించేందుకు కలుపుమందు పిచికారీ పనులను ఆయన పరిశీలించారు. చెత్తబండి ఇంటింటికి వెళ్లి సేకరిస్తున్నదీ లేనిదీ స్థానిక ప్రజలను ఎంపీడీవో అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జీ. ప్రసాదరావు, పంచాయతీ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

పాఠశాలలు తనిఖీ చేసిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ


ముక్కామల హైస్కూల్‌లో ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పెరవలి, జూలై 30(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాలలను బుధవారం సందర్శించారు. యోగాడే మెగా పేరెంట్స్ డే పేరిట ఉపాధ్యాయులపై పనిభారం పెంచడం దురదృష్టకరమన్నారు. పలురకాల ఆన్‌లైన్ పనుల వల్ల ఉపాధ్యాయులు బోధనేతర పనుల్లో చిక్కుకుపోతున్నారని, వీటిని తగ్గించాలని పేర్కొన్నారు. గత ప్రభుత్వం 11వ పీఆర్‌సీ రివర్స్‌గా అమలు చేసిందని, ప్రస్తుత ప్రభుత్వం తక్షణమే 12వ పీఆర్‌సీ అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి వీ. వెంకట రమణ, జిల్లా కౌన్సిలర్ ఎం. శేఖర్‌రాజు, మండల ప్రధాన కార్యదర్శి డీవీఎస్ఆర్ తారా కృష్ణ, మండల గౌరవాధ్యక్షుడు వీఎస్‌వీ సత్యనారాయణ, తదితరులు ఉన్నారు.

194 మందికి వితంతు పింఛన్లు మంజూరు

బిక్కవోలు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో 194 మందికి వితంతు పింఛన్లు మజూరయ్యాయని ఇన్‌చార్జి ఎంపీడీవో వి. నాగేంద్రప్రసాద్ బుధవారం తెలిపారు. ఇటీవల భర్తలు పింఛన్ తీసుకుంటూ చనిపోవడంతో వారి స్థానంలో వారి భార్యలకు ఈ పింఛన్లను అందజేస్తామన్నారు. ఆగస్టు 1న పంపిణీ చేస్తామన్నారు.

గుర్రపు డెక్క ఇలా.. నీరు పారేదెలా?

• నందమూరు-పశివేదల పంటకాలువలో పేరుకుపోయిన పూడిక
• ఆవేదన వ్యక్తం చేస్తున్న అన్నదాత


కొవ్వాడ కాలువలో పెరిగిన గుర్రపు డెక్క


కొవ్వాడ కాలువలో

కొవ్వూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పంట కాలువల్లో పేరుకుపోయిన పూడికలు పూర్తిస్థాయిలో తొలగించకపోవడంతో రైతులు పంట నష్టానికి గురవుతున్నారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని కుమారదేవం నుంచి ఆరికిరేవుల, నందమూరు, పశివేదల మీదుగా వర్షపు నీరు, పంట పొలాల్లో పారే నీరు పేములకాలువ వద్ద చేరుతాయి. అయితే ఈ కాలువలో గుర్రపుడెక్క ఏపుగా పెరిగిపోవడంతో నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారుతోంది. దీంతో రైతులు గత కొన్ని సంవత్సరాలుగా తీవ్రఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో నీరు ముందుకు పారక పోవడం వల్ల పంటపొలాలను ముంచెత్తుతోంది. పొలాల్లో రోజుల తరబడి నీరు నిలిచిపోవడంతో అన్నదాతలకు పంట నష్టం వాటిల్లుతోందని ఆందోళన చెందుతున్నారు. కాలువలో పెరిగిపోయిన గుర్రపుడెక్కను పూర్తిస్థాయిలో తొలగించాలని, కాలువపై ఆక్రమణలకు గురైన అడ్డుకట్లను తొలగించి, కాలువలో పూర్తిస్థాయిలో పూడికలు తీయించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. ప్రతి సంవత్సరం వర్షాకాలంలో కొవ్వాడ కాలువ పొంగిపోవడంతో రైతులు పంట నష్టపోతున్నారు. నందమూరు జంక్షన్ జగన్న కాలనీ వద్ద కాలువ, పశివేదల వెళ్లే పెరిగిన గుర్రపుడెక్కను పూర్తిస్థాయిలో తొలగించాలని గత 5 ఏళ్లుగా వైసీపీ ప్రభుత్వంలో అధికారులకు, నాయకులకు వినతిపత్రాలు అందించినా ఎటువంటి ఫలితం లేదని రైతులు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా పంట కాలువలు పూడికలు, గుర్రపుడెక్క తొలగించాలని వారంతా కోరుతున్నారు.

లయన్స్ క్లబ్ సేవలు సమాజ శ్రేయస్సుకు దోహదం

• ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ సభ్యులు చేస్తున్న సేవలు సమాజశ్రేయస్సుకు ఎంతగానో దోహదపడుతున్నాయని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు లిటరరీ క్లబ్ కల్యాణ మండపంలో బుధవారం కొవ్వూరు, తాళ్లపూడి, దేవరపల్లి లయన్స్‌క్లబ్‌ల నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మద్దిపాటి సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని నూతన పాలవర్గాలతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం పలువురు మాట్లాడారు. కొవ్వూరు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడిగా పెనుమాక జయరాజు, కార్యదర్శిగా యాగంటి చలపతి, కోశాధికారిగా పాలడుగుల లక్ష్మణరావు, తాళ్లపూడి అధ్యక్షుడిగా నామాన పరమేశ్వరరావు, సెక్రటరీగా నున్న సోమశేఖర్, ట్రెజరర్‌గా ఎల్లిన బ్రహ్మానందం, దేవరపల్లి అధ్యక్షుడిగా పెందుర్తి రామరహిత, సెక్రటరీగా ఆత్కూరి వెంకటేష్, ట్రెజరర్‌గా పెందుర్తి సుధీర్‌కుమార్‌తో ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో డా.వీకే.పంకజాక్షన్, కొత్తపల్లి రవికుమార్, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కంటమణి రామకృష్ణారావు, పాలింపాటి చినబాబు చౌదరి, కోడూరి శిరామకృష్ణ, సూరపనేని చిన్ని, యనమదల సుబ్రహ్మణ్యం, నామాన పరమేశ్వరరావు, కంటమణి రమేష్ బాబు, అల్లూరి గౌరీరావు, మద్దుకూరి శ్రీహరి, ఉప్పులూరి రామకృష్ణ, కంటమణి కిషోర్, నాళం శ్రీనివాసరావు, ఎండీ హుస్సేన్, నామానబుల్లిరాజు, తదితరులు పాల్గొన్నారు.

గజ్జరంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం


మహిళకు కరపత్రాన్ని పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

తాళ్లపూడి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): గజ్జరంలో బుధవారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. టీడీపీ నేతలతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గత ఏడాది కాలంగా కూటమి ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని గురించి వివరించారు.టీడీపీ నేతలు పాల్గొన్నారు.

తాళ్లపూడి ప్రధాన రహదారి... గోతులమయం


తాళ్లపూడి మెయిన్‌రోడ్డు దుస్థితి

తాళ్లపూడి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రధాన రహదారి గోతులమయంగా మారింది. దీంతో ప్రజల రాకపోకలు, వాహనదారులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ముఖ్యంగా తాళ్లపూడి నుంచి ప్రక్కిలంక, వేగేశ్వరపురం వరకు పలుచోట్ల లోతైన గోతులు తయారవ్వడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. కొన్నిచోట్ల ప్రజలే ఈ ప్రదేశం ప్రమాదకరమని కర్రలకు ఎర్ర జెండాలు కట్టి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. దీనిపై స్థానికులు మాట్లాడుతూ గత పుష్కరాల సమయంలో కొత్త రోడ్లు వేశారన్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు మరమ్మతులు చేయలేదన్నారు.

నిడదవోలు పట్టణంలో వాహనాల తనిఖీ


వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

నిడదవోలు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనల ప్రకారం వాహనదారులు అన్ని పత్రాలను ఉంచుకోవాలని, తనిఖీల సమయంలో వాటిని అధికారులకు చూపించాలని ఎస్ఐ జగన్మోహనరావు అన్నారు. బుధవారం పట్టణంలోని గణపతి సెంటరు వద్ద ఉన్న ఐ లవ్ నిడదవోలు వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఇందులో ట్రైనీ ఎస్ఐ కల్పన, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బదిలీ సచివాలయ సిబ్బందికి సన్మానం


సిబ్బందిని సన్మానిస్తున్న సర్పంచ్ రాంబాబు

తాళ్లపూడి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): గజ్జరం గ్రామ సచివాలయం నుంచి బదిలీపై వెళ్లిన సెక్రటరీలను బుధవారం సర్పంచ్ గండి రాంబాబు, ఉప సర్పంచ్ శేష ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో బదిలీ సెక్రటరీలు మణికుమార్, భారతి, కరుణ, సుధీర్, పద్మ, సెక్రటరీ శ్రీనివాస్, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రీసర్వే ఫేజ్-3 అమలుకు చర్యలు

• తహశీల్దార్ లక్ష్మీలావణ్య

తాళ్లపూడి, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండలంలో రీసర్వే ఫేజ్-3 కార్యక్రమాన్ని అమలు చేసేందుకు చర్యలు చేపట్టామని తహశీల్దార్ లక్ష్మీ లావణ్య బుధవారం తెలిపారు. మొదటగా అన్నదేవరపేట, తాళ్లపూడి, వేగేశ్వరపురం, కుకునూరు, పెద్దేవం, మలకపల్లి గ్రామాల్లో చేపట్టామన్నారు. కార్యక్రమంలో రెవిన్యూ రికార్డులు, భూమిపై గల వ్యత్యాసాలను గుర్తించి సరిచేయడం, గ్రామ సరిహద్దులు నిర్ధారించడం, ప్రభుత్వ భూముల సరిహద్దులను నిర్ధారించడం, రైతువారి భూములను సర్వేచేసి రీసర్వే రికార్డులు తయారుచేయడం జరుగుతుందన్నారు. గ్రామప్రజలు, రైతులు, గ్రామ రెవెన్యూ అధికారి, సర్వేయర్లకు సహకరించాలన్నారు.

విద్య ... శక్తివంతమైన ఆయుధం

• ఏలూరు పీఠాధిపతులు బిషప్ జయరాజు పొలిమేర, బాల


సమావేశంలో మాట్లాడుతున్న జయరాజు పొలిమేర

నల్లజర్ల, జూలై 30 (ఆంధ్రజ్యోతి): విద్య అనేది ప్రపంచాన్ని, సమాజాన్ని మేల్కొలపడానికి ఒక శక్తివంతమైన ఆయుధంగా ఉపయోగపడుతుందని ఆర్‌సీఎం ఏలూరు పీఠాధిపతులు బిషప్ జయరాజు పొలిమేర, బిషప్ బాల అన్నారు. నల్లజర్ల సెయింట్ క్లారెట్ హైస్కూల్‌లో రూ. మూడు కోట్ల 50 లక్షలతో నిర్మించిన నూతన భవనాలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారిద్దరు మాట్లా డుతూ ప్రతి ఒక్కరూ విద్య పట్ల ఆసక్తి కలిగి ఉండాలన్నారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదివితే సమాజంలో గౌరవ, మర్యాదలు కలుగుతాయన్నారు. బెంగులూరుకు చెందిన సెయింట్ క్లారెట్ జనరల్ మేనేజర్ ఫాదర్ సాబు జార్జీ మాట్లాడుతూ సెయింట్ క్లారెట్ విద్యాసంస్థలు విలువలతో కూడిన విద్యను అందిస్తుందన్నారు. అనంతరం పలువురు మాట్లాడారు. కార్యక్రమంలో ఫాదర్ సబస్టీన్, ప్రిన్సిపాల్ రవికుమార్ రెడ్డి, ఫాదర్ ఆంటోని, ఫాదర్ జయరాజు, డీవైఈవో రమణదొర, ఎంఈవోలు సత్యనారాయణ, భగవతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారి ఆత్మహత్యాయత్నం

నల్లజర్ల, జూలై 30 (ఆంధ్రజ్యోతి): దూబచర్ల డైట్ కళాశాలకు వెళ్లే మార్గం వద్ద ఓ చిన్న దుకాణం నడుపుతున్న చిరు వ్యాపారి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గత 15 సంవత్సరాలుగా ఇక్కడే పాన్ షాపు నిర్వహిస్తున్నాడు. బుధవారం పంచాయతీ కార్యదర్శి ఆశ అలైఖ్య పోలీసు సిబ్బందితో ఆ ప్రాంతాన్ని ఖాళీ చేసే ప్రయత్నం చేయగా, తన జీవనాధారం పోతుందని ఇంటికి వెళ్లి పురుగుమందు సేవించాడు. దీంతో కుటుంబ సభ్యులు వెంటనే నల్లజర్ల ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం తాడేపల్లిగూడెం ఆసుపత్రికి తరలించారు. దీనిపై కార్యదర్శి ఆశ అలేఖ్యను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా కొట్టు వద్ద చెట్టు ఉండడం వల్ల వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుందని గ్రామానికి చెందిన కొంతమంది ఫిర్యాదు చేయ్యడంతో తాను పలుమార్లు చెట్టు కొమ్మలను తొలగించాలని చెప్పినా పట్టించుకోలేదు.

దీనిపై పోలీసు కేసు పెట్టి లైన్‌మెన్, పోలీసులు చెట్టును తొలగించేందుకు వెళ్లగా కొట్టును తీసేస్తున్నారని చెప్పి అబద్ధాలు సృష్టించినట్టు పేర్కొన్నారు. ఈ క్రమంలో ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించినట్టు ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది.

దాడి కేసులో వ్యక్తికి ఏడేళ్ల జైలు శిక్ష

రాజమహేంద్రవరం సిటీ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కడియం పోలీస్ స్టేషన్ పరిధిలో మాధవరాయుడు పాలెంలో బొల్లా ధనుంజయ అలియాస్ డీజెఎస్‌పై డ్రింక్ సీసాతో దాడి చేసిన ముంజేటి సురేష్ అనే వ్యక్తిపై నేరం రుజువు కావడంతో ఏడు సంవత్సరాల జైలు శిక్ష విధిస్తూ రాజమహేంద్రవరం ఎనిమిదో అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి వై.బెన్నయ్యనాయుడు తీర్పునిచ్చారు. 2024లో జరిగిన ఈ సంఘటనపై అప్పట్లో కడియం పోలీసులు కేసు నమోదు చేశారు. మద్యం మత్తులో సురేష్ ఈ దాడి చేసినట్టు అప్పటి సీఐ టి.కృష్ణసాయి కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ ఫైల్ చేశారు. ఈ కేసులో సాక్షులను ప్రస్తుత కడియం సీఐ ఎ.వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో కోర్టు కానిస్టేబుల్ కే.శ్రీనివాస్ కోర్టులో హాజరుపరిచారు. అడిషనల్ పీపీ కే.రాధాకృష్ణరాజు వాదన వినిపించారు. న్యాయమూర్తి తుది తీర్పును వెల్లడించారు. నిందితుడికి ఏడు సంవత్సరాలు జైలు శిక్ష, రూ.5వేలు జరిమానా విధించారు.

గంజాయితో ఐదుగురి అరెస్టు

• 2.57 కిలోల గంజాయితో పాటు మోటారు సైకిల్, రూ.1500 నగదు స్వాధీనం


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ, సీఐ, ఎస్ఐ

సీతానగరం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం నల్గొండ శివారున గంజాయితో ఐదుగురిని అరెస్ట్ చేసి నట్టు నార్త్‌జోన్ డీఎస్పీ వై.శ్రీకాంత్ తెలిపారు. బుధవారం సీతానగరం పోలీస్‌స్టేషన్‌లో విలేకర్ల సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు నార్త్‌జోన్ డీఎస్పీ, శ్రీకాంత్ కోరుకొండ సీఐ వై.సత్యకిషోర్ పర్యవేక్షణలో సీతానగరం ఎస్ఐ డి.రామ్‌కుమార్ దాడి చేశారు. నల్గొండ శివారున గంజాయి రవాణా చేస్తున్న అదే గ్రామానికి చెందిన చింతల గంగరాజు, బండారు అప్పన్న దొర, తొర్రేడు గ్రామానికి చెందిన తాటిపాక గణేష్, కడియం మండలం మురమండకు చెందిన నేరుమిల్లి అఖిల్, సీతానగరం మండలం బొబ్బిల్లంకకు చెందిన పోలిన సాయి సతీష్‌ను నల్గొండ శివారు మామిడి తోటల వద్ద అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 2.57 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వీఆర్వో సమక్షంలో ఐదు గంజాయి ప్యాకె ట్లు, మోటారు సైకిల్, రూ.1500 నగదు స్వాధీనం చేసుకున్నట్టు, కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించినట్టు పోలీసులు పేర్కొన్నారు. గం జాయిని ఒడిస్సా ఏజెన్సీ ప్రాంతం నుంచి కొనుగోలు చేసి ఇక్కడకు తీసు కొచ్చి చిన్న ప్యాకెట్లుగా చేసి విక్రయాలు చేస్తున్నట్టు వారు తెలిపారు.

రేపు విద్యుత్ సరఫరా నిలుపుదల

కొవ్వూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): వాడపల్లి 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ వార్షిక మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఈఈ నారాయణ అప్పారావు తెలిపారు. వాడపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని 11కెవి వేములూరు, వాడపల్లి, మద్దూరు, వాడపల్లి లోకల్, మహర్షి వేద పాఠశాల ఫీడర్స్ వార్షిక మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామన్నారు. దీంతో వాడపల్లి, వేములూరు, తోగుమ్మి, మద్దూరు, మద్దూరులంక గ్రామాలు, మహర్షి వేద పాఠశాల ప్రాంతాలలో విద్యుత్ అంతరాయానికి ప్రజలు సహకరించాలన్నారు. వ్యవసాయానికి ఉదయం నాలుగు నుంచి 9 గంటల వరకు, మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం 6 వరకు విద్యుత్ సరఫరా అందించడం జరుగుతుందని ఏఈ డీ.జగదీశ్వరరావు తెలిపారు.

దేచర్ల సబ్‌స్టేషన్ పరిధిలో...

కొవ్వూరు మండలం దేచర్ల సబ్‌స్టేషన్ పరిధిలో దేచర్ల, దర్మవరం ఏజీఎల్ ఫీడర్ వార్షిక మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయడం జరుగుతుందని ఏఈ సి.హెచ్.శ్రీనివాసరావు తెలిపారు. వ్యవసాయానికి ఉదయం నాలుగు గంటల నుంచి ఏడు వరకు, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు 3 ఫేజ్ విద్యుత్ సరఫరా అందించడం జరుగుతుందన్నారు. ధర్మవరం, పెనకనమెట్ట పవరం రైతులు సహకరించాలన్నారు.

'రైతులు ఫసల్ బీమా చేయించుకోవాలి'


కుమారదేవంలో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న శ్రీనివాసరావు

కొవ్వూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): రైతులు తప్పనిసరిగా పంటలకు ఫసల్ బీమా చేయించుకోవాలని కొవ్వూరు డివిజనల్ వ్యవసాయ సహాయ సంచాలకుడు డా. సీహెచ్.శ్రీనివాసరావు అన్నారు. ఆరికిరేవుల, కుమారదేవంలో బుధవారం వ్యవసాయశాఖాధికారి ఏ.గంగాధర్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారులు పంట పొలాలను పరిశీలించి, రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సార్వా 2025 పంటలకు సంబంధించి తుపానులు, కరువు, అకాల వర్షాలు వంటి ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టపోయిన రైతులకు ఆర్థిక సహాయం అందాలంటే రైతులందరూ ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (పిఎంఎఫ్‌బివై) పథకం నందు ప్రీమియం చెల్లించి, పంటలకు బీమా చేయించుకోవాలన్నారు. వరిపంటకు ఎకరాకు రూ. 38,462 బీమా చేయబడుతుందన్నారు. రైతు ప్రీమియం కేవలం రూ. 576.92 చెల్లిస్తే సరిపోతుందన్నారు. ఏవో ఏ.గంగాధర్, ఆరికిరేవుల సొసైటీ కార్యదర్శి చావా ప్రసాద్, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: వరిసాగు చేసేరైతులు ఆగస్టు 15తేదీలోపు పంట బీమా పథకం చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి బి. రాజారావు పేర్కొన్నారు. బుధవారం దమ్మెన్ను, ఉండ్రాజవరం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటల బీమాపథకం కింద ప్రీమియం చెల్లించిన యెడల గ్రామం యూనిట్‌గా, దిగుబడి ఆధారంగా పంటల బీమా వర్తించే అవకాశం ఉందన్నారు. దీని కోసం పంట రుణం తీసుకునే బ్యాంకును సంప్రదించాలని ఆయన చెప్పారు. ఉద్యానవన శాఖాధికారి డీ. సుధీర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యానవన పంటలు వేసేవారిని ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. ఉద్యానవనశాఖద్వారా వచ్చే పథకాలలు గురించి ముఖ్యంగా ఆయిల్‌పామ్ తోటల పెంపకం, రాయితీపై డ్రిప్ పథకాలు గురించి ఆయన రైతులకు వివరించారు. కార్యక్రమంలో రైతులు, రైతుసేవా కేంద్రాల సిబ్బంది లోకేశ్వరి, సురేష్, గ్రేస్, హైమా పాల్గొన్నారు.


ఉండ్రాజవరంలో ఉద్యాన వన పంటల గురించి రైతులకు వివరిస్తున్న అధికారులు

గోపాలపురంలో మెగా రక్తదాన శిబిరం


రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న తహశీల్దార్ అజయ్‌బాబు

గోపాలపురం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మానవత్వానికి ప్రతీక మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అని తహశీల్దార్ అజయ్‌బాబు అన్నారు. ఈ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం మెగా రక్తదాన శిబిరాన్ని స్థానిక చర్వాణి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో నిర్వహించారు. దీనిలో భాగంగా సుమారు 150 మంది వరకు వచ్చి రక్తదానం చేశారు. అనంతరం మానవత మండల చైర్మన్ జొన్నలగడ్డ రాంబాబు, మండల అధ్యక్షుడు ఫణికిషోర్ మాట్లాడారు. ఎంపీడీవో రాజమనోహర్, శిక్షణ సబ్‌ఇన్‌స్పెక్టర్ శివగణేశ్, బ్లడ్ బ్యాంక్ డైరెక్టర్ రెల్లి చంద్రశేఖర్, గుబ్బా లక్ష్మణరావు, రాధాకృష్ణ, కీర్తికుమార్, కృపావరప్రసాద్, తదితర సేవా సంస్థ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

మహిళను వేధించిన ఇద్దరిపై కేసు

రాజమహేంద్రవరం సిటీ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మహిళను వేధించిన కేసులో ఇద్దరిపై బొమ్మూరు పోలీసులు కేసు నమోదు చేశారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం దివాన్‌చెరువు గ్రామానికి చెందిన కే లక్ష్మి అనే మహిళకు ఈనెల 9న రాత్రి 11:30 గంటల సమయంలో ఇద్దరు వ్యక్తులు ఫోను చేసి బెదిరింపులకు గురిచేయ్యడమే కాకుండా వాట్సాప్ గ్రూప్‌లలో అసభ్యకరంగా వాయిస్ మెసేజ్‌లు పెట్టి అవమానించారని ఈనెల 29న పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో బొమ్మూరు పోలీసులు మునగాలకు చెందిన జీ.సుమంత్, పెద్దాపురానికి చెందిన ఎం.రాజుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.